జనరాజకీయం కోసం ...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 4 సంచిక - 2 పక్షపత్రిక జనవరి 16-31, 2013

## లోక్‌సత్తా పార్టీ సంస్థాగత ఎన్నికలకు సన్నాహాలు





ఒంగోలు గ్రానైట్ కార్మికులతో...



ఒంగోలు గ్రానైట్ పరిశ్రమలో....





కూకట్‌పల్లి పి.ఎస్.ఎమ్. స్కూల్ వార్షికోత్సవంలో....



కర్నూలు సభ్యత్వ నమోదులో జేపీ




Hyderabad ...10th ERA Annual National Conference



కర్నూలులో విలేకర్ల సమావేశం



జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక జనవరి 16-31, 2013

సంపుటి - 4 సంచిక - 2

## లోపలి పేజీల్లో...

స్వామి వివేకానంద ........................... 5

అవినీతిపరుల భరతం........................... 6

రాష్ట్రంలో పౌరసేవల చట్టం.................. 7

దారి తప్పిన బాటసారి ........................ 8

తెలుసుకోదగ్గ విషయాలు.................. 12

కవితలు............................................ 14

సభ్యత్వ ఫారాలు.................................16

జిల్లాల్లో కార్యకలాపాలు....................... 18

జ్వరం, వ్యాధి లక్షణం మాత్రమే...............32

# పౌరసేవల చట్టం - సురాజ్య ఉద్యమ విజయం

## సంపాదకీయం

సురాజ్య ఉద్యమం తొలిదశ డిసెంబరు 9న ముగిసింది. మలిదశ కార్యకలాపాలు మన ఊళ్లో సురాజ్యం పేరుతో మున్సిపల్ ప్రజాకౌన్సిల్ రూపంలో కొనసాగుతున్నాయి. రాజకీయాలకి అతీతంగా అందరి భాగస్వామ్యంతో సాగిన ఉద్యమం. వివిధ తరగతుల ప్రజల్ని ముఖ్యంగా మధ్యతరగతి వర్గాలను, సీనియర్ సిటిజన్స్‌ను ప్రత్యేకించి విద్యార్థుల్ని విశేషంగా ఆకర్షించింది.

ఈ ఉద్యమం పౌరుల చుట్టూ, పౌర సేవల చుట్టూ ప్రధానంగా రూపుదిద్దుకుంది. మన ఊళ్లో మంచి వసతుల కోసం - శుద్ధిచేసిన మంచినీరు, ఈగలు, దోమలు లేని పారిశుధ్యం, పక్కా రోడ్లు, లైట్లు, అందరికీ మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు పొందడం కోసం స్థానిక ప్రభుత్వాలకు సాధికారత కల్పించాలని, ప్రజల అవసరాలు తీర్చడానికి తలసరి వెయ్యి రూపాయలు గ్రాంటు నేరుగా పంచాయితీలకు, మున్సిపల్ వార్డులకు అందించాలన్నది ఒక డిమాండ్ కాగా రెండవ డిమాండ్‌గా లంచాలు లేకుండా, జాప్యం లేకుండా ప్రభుత్వ సేవలు అందే ఏర్పాటు కోసం పౌరసేవల హక్కు చట్టం కావాలని కోరింది. పెచ్చరిల్లుతున్న అవినీతి భరతం పట్టడానికి బలమైన లోకాయుక్త, అంబుడ్స్‌మన్ వ్యవస్థలను మూడవ అంశంగా ప్రకటించింది. వీటన్నింటి లక్ష్యం అందరికీ ఎదిగే అవకాశాలు కల్పించడం అంటే పుట్టిన ప్రతిబిడ్డకీ డబ్బుతో, కులంతో, కుటుంబంతో నిమిత్తం లేకుండా మంచి ప్రమాణాల విద్యని అందించడం. అందరికీ అన్ని జబ్బులకీ ఉచితంగా వైద్యసేవలు అందించడం లక్ష్యం కావాలని తేల్చి చెప్పింది. ఇవీ రాష్ట్రానికి సంబంధించిన తక్షణ అంశాలు.

ఈ అంశాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని నవంబరు 30వ తేదీన సురాజ్య సారధ్యం సంఘసభ్యులు డా॥ జె.పి. నాయకత్వంలో ముఖ్యమంత్రిని కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా చర్చకు వచ్చిన మీ సేవ కార్యక్రమంలో లోటుపాట్లను కూడా ముఖ్యమంత్రికి వివరించడం జరిగింది.

ఈ నేపథ్యంలో జనవరి 12వతేదీన "మీ సేవ" ద్వారా రాష్ట్రంలో ఒక కోటి లావాదేవీలు పూర్తయిన సందర్భంగా ముఖ్యమంత్రి స్పందిస్తూ" మీ సేవ " ద్వారా సకాలంలో సేవలు అందించని అధికారులకు జరిమానాలు విధించి, ఆలస్యం కారణంగా నష్టపోయిన పౌరులకు నష్టపరిహారం చెల్లించనున్నట్లు ఈ మేరకు ప్రభుత్వం త్వరలో చట్టం చేయనుందని తెలిపారు.

ముఖ్యమంత్రి స్పందనను స్వాగతిస్తున్నాం.

ఇది సురాజ్య ఉద్యమ విజయంగా ప్రకటిస్తున్నాం. పౌర సేవల హక్కు చట్టం నమూనాను గతంలోనే ముఖ్యమంత్రికి అందించడం జరిగింది.

ప్రతి ఆఫీసులో పౌరసేవా కేంద్రం గడువుతో కూడిన సిటిజన్స్ ఛార్టర్లు, గడువులోగా అందించకపోతే పరిహారం, అలసత్వం చేసిన వారికి జరిమానాలు, సేవలు విధిగా అందించడానికి తగిన అప్పిలేట్ అధికార యంత్రాంగంతో కూడిన చట్టాన్ని బడ్జెట్ సమావేశాలలోనే తీసుకు రావలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం. ■

## సంపాదకవర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

డి.వి.వి.యస్. వర్మ
సంపాదకులు

సంపాదక వర్గం

జి. రాజారెడ్డి
బండారు రామ్మోహన్‌రావు
కొంగర గంగాధరరావు
కె.వి. కుటుంబరావు
సి.హెచ్.ఎస్. మాధవరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి
ఫొటోలు : ఎన్. సంజీవ్ కుమార్

## ఆ చిలక పలుకుల వెనుక




# కార్టూన్ కార్నర్

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.


**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**

*8-2-674బి/2/9, ప్లాట్ నం : 93*
*హ్యాపీ వ్యాలి, రోడ్ నం. 13ఎ,*
*బంజారాహిల్స్, హైదరాబాద్ - 500 034*

***ఫోన్ నంబర్లు :***
***040- 23311817, 23311819,***
***23311820, 23312829***
***ఫ్యాక్స్ : 040-23310612***
accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com


## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311817**

విడి ప్రతి : రు. *10* ,
ఏడాది చందా : రు. *200*
మూడేళ్ళ చందా : రు. *500*

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: *62007167836* ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# వివేకానంద కలల్ని నెరవేర్చేందుకు యువత క్రియాశీలకంగా కృషి చేయాలి: జేపీ

స్వామి వివేకానందతోపాటు ఇతర మన జాతీయోద్యమ నిర్మాతల కలల్ని, ఆకాంక్షల్ని నెరవేర్చేందుకు యువభారతీయులు క్రియాశీలకంగా కృషిచేయాలని లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ పిలుపునిచ్చారు.

జాతీయ యువజన దినోత్సవంగా జరుపుకుంటున్న స్వామి వివేకానంద జయంతి (జనవరి 12) సందర్భంగా జేపీ ఒక సందేశ ప్రకటనను విడుదల చేస్తూ, భావిభారత నిర్మాణంలో యువతే కీలకమని వారి మీదే ఎక్కువగా దృష్టి కేంద్రీకరించి వివేకానంద పనిచేశారన్నారు.

పేదలను విముక్తి చేసి, కులం, మతంతో సంబంధం లేకుండా ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశాలను కల్పించటంలోనే నిజమైన ఆధ్యాత్మిక సారాంశం ఉంటుందని చాటిచెప్పిన తొలి ఆధ్యాత్మిక నేత స్వామి వివేకానంద అని జేపీ అన్నారు. ఒకరకంగా ఆయన ఆధునిక జాతీయతాభావానికి పునాది వేశారన్నారు.

వలసవాదుల పాలనలో బానిసత్వ భావజాలంలో మగ్గుతున్న భారతీయులలో ఆత్మగౌరవం, హుందాతనం భావాల్ని వివేకానంద పునరుజ్జీవింప చేశారని జేపీ అన్నారు. "మన శరీరపు రంగు, విశ్వాసం సిగ్గుపడాల్సినవి కావని, మన వేల ఏళ్ల అవిచ్ఛిన్నమైన చరిత్ర, నాగరికత, సంస్కృతి మనందరం సగర్వంగా చాటుకోదగినవని వివేకానంద తెలియచెప్పారు. ఐదువేల ఏళ్ల భారతీయ సంస్కృతి అనేక విశ్వాసాలను, నమ్మకాలను, సంప్రదాయాలను తనలో ఇముడ్చుకుంది. ఈ క్రమంలోనే, మానవచరిత్ర మొత్తంలో సాటిలేని వైవిధ్యం నిండిన సమ్మిళిత నాగరికత, పలురకాల



ఆలోచనాస్రవంతుల మధ్య అసమాన సామరస్య అనుసంధానం మనదేశంలో వెల్లివిరిశాయి" అని జేపీ పేర్కొన్నారు.

"అవకాశాలు ఇంకా అందని వారి కష్టాల పట్ల సానుభూతి, మన సంస్కృతీవారసత్వాల పట్ల సగర్వభావం, అందరి అభివృద్ధికీ ఖచ్చితమైన అవకాశాలను కల్పించే గొప్ప దేశంగా భారత్‌ని నిర్మించి ప్రపంచదేశాల మధ్య అగ్రరాజ్యంగా నిలుపుతామన్న ఆత్మవిశ్వాసం వంటి లక్షణాలను మనందరం పెంపొందించుకోవాలి" అని జయప్రకాష్ నారాయణ్ కోరారు. ■

## నాయకుడవ్వటం ఎలా ?

**"విధేయతను కలిగియుండి, సేవకుడిగా ఉండడం అలవర్చుకుంటే నాయకుడయ్యే యోగ్యత లభిస్తుంది.**

– స్వామి వివేకానంద

# అవినీతిపరుల భరతం పడుతున్న బ్రెజిల్

## అవినీతిని వ్యతిరేకిస్తూ బలమైన చట్టం అమలు

**పౌర సమాజమే సూత్రధారి**

**- ఇంజేటి సాయి చరణ్ తేజస్వి**

బ్రెజిల్ దేశానికీ భారతదేశానికి ఎన్నో పోలికలు ఉన్నాయి. రెండూ కూడా ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యం కల దేశాలు. అభివృద్ధి చెందుతున్న దేశాలు. అంతేకాక బ్రెజిల్ మన దేశంలోనే అవినీతిపరమైన రాజకీయాలు దేశ రాజకీయ వ్యవస్థలను భ్రష్టు పట్టిస్తున్నాయి. ఉదాహరణకు బ్రెజిల్ పార్లమెంట్‌లో 147/513 దిగువ సభ సభ్యులు, 21/81 ఎగువ చట్టసభ సభ్యులు అవినీతి ఆరోపణలని ఎదుర్కొంటున్నారు. చాలా కేసులు ప్రచారణ నిధుల చట్టాలని ఉల్లంఘించడానికి ప్రజా నిధులను అక్రమంగా దోచుకోడానికి చెందినవి.

రెండేళ్ళ క్రితం బ్రెజిల్‌లో ఇటువంటి అవినీతిపరమైన రాజకీయ నాయకులని భయపెట్టగలిగే చట్టాలు బలహీనంగా ఉండేవి. వారి అవినీతి వ్యతిరేక వ్యవస్థ ఎంత లోపభూయిష్టంగా ఉండేదంటే అవినీతిపరమైన రాజకీయ నాయకులు అక్రమ మార్గంలో అడుగు వేసేముందు అసలు ఒక్కసారి కూడా ఆలోచించేవారు కారు.

కాని జూన్ 2010లో శక్తివంతమైన పౌరసమాజ ఉద్యమం ఫలితంగా బ్రెజిల్‌లో ఎంతో బలమైన చట్టం చేయబడింది. ఈ చట్టం యొక్క కీలకమైన అంశాలు

**ఏమిటంటే:-**

- తీవ్రమైన నేరాలు, పెద్ద అవినీతి ఆరోపణలలో దోషులుగా తేలిన ప్రజాప్రతినిధులని 8 ఏళ్ల వరకు పదవులకి దూరంగా ఉంచుతారు / అనర్హులుగా ప్రకటిస్తారు.
- అనర్హత వేటు నుండి తప్పించుకోవడం కోసం మాత్రమే పదవుల నుండి రాజీనామాలు చేసి తిరిగి పోటీ చేసే ప్రతినిధులకి సైతం ఇది వర్తిస్తుంది.
- ఇంకో ముఖ్యమైన అంశమేమిటంటే ప్రజాప్రతినిధులని అనర్హులుగా ప్రకటించాలా వద్దా అన్న నిర్ణయం చేసేది ప్రభుత్వం కాదు, రాజకీయ నాయకులు అసలే కారు. ఈ కీలక నిర్ణయాలు చేసేది స్వతంత్ర ప్రతిపత్తి గల ఎన్నికల ట్రైబ్యునల్స్.
- ఈ చట్టం రాకముందే రాజీనామాలు చేసి అనర్హత నుండి తప్పించుకుందామనుకున్న ప్రస్తుతం, గత పార్లమెంటు సభ్యులు / ప్రజాప్రతినిధులకి సైతం ఈ చట్టం వరిస్తుందని బ్రెజిల్ న్యాయవ్యవస్థ గత నెలలోనే తీర్పుని కూడా ఇచ్చింది.

ఈ కట్టుదిట్టమైన స్వతంత్ర ప్రతిపత్తిలో నడిచే బలమైన చట్ట వ్యవస్థ వల్ల వందల సంఖ్యలో అవినీతిపరులైన శాసన, పార్లమెంటు సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు భవిష్యత్తులో నిర్వహించబోయే ఎన్నికలకు దూరంగా ఉండాల్సి వస్తుంది. అక్టోబర్ 2012లో జరిగే మున్సిపల్ ఎన్నికల నుండి 317 మేయర్ అభ్యర్థులని బ్రెజిల్ స్థానిక ఎన్నికల న్యాయస్థానాలు ఎన్నికల నుండి బహిష్కరించాయంటే 'ficha limpa' చట్టం యొక్క బలాన్ని మనము తెలుసుకోవచ్చు.

ఈ విప్లవాత్మక చట్టం అమలులోకి రావడానికి ముఖ్యకారణం బ్రెజిల్ పౌరసమాజమే! 15 లక్షల మంది పౌరులు కలిసి జాతీయ పార్లమెంట్‌కు ఆన్‌లైన్ పిటిషన్లను అందించడంతోపాటు ఇతర ప్రజాస్వామ్య పద్ధతులలో ఒత్తిడి తీసుకొచ్చారు. ఇంతకుముందు అవినీతి వ్యతిరేక చట్టాలను అదీ రాజకీయ అవినీతిని కట్టడి చేసే చట్టాలను రూపొందించి, అమలు చేయడంలో అనాసక్తి కనబరిచిన బ్రెజిల్ పార్లమెంట్ ఆఖరుకి ప్రజా చైతన్యం ముందు సంఘటిత పౌర సమాజం ముందు దిగి రావలసి వచ్చింది. ఫలితంగా అవినీతిమయంగా ఉన్న బ్రెజిల్ రాజకీయాలలో పెనుమార్పులు జరగబోతున్నాయి. ఆ దేశంలోని అన్ని స్థాయిల్లో అన్ని ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులని అవినీతి పర మార్గాన్ని ఎందుకోకుండా భయపెట్టగలిగే శక్తి కలిగి ఉన్న చట్టం “ఫిచా లింపా” చట్టం. 40 కోట్ల మంది యువత, 30 కోట్ల మంది మధ్యతరగతికి చెందినవారు, 12 కోట్లకు పైగా ఇంటర్నెట్ వినియోగదారులు కలిగి వున్న భారతదేశము కూడా బ్రెజిల్ దేశము యొక్క అనుభవము నుండి నేర్చుకుంటే మన ప్రభుత్వ పాలనకు చెందిన అనేక రంగాల్లో సంస్కరణలు తీసుకొని రాగలము. ■

# రాష్ట్రంలో పౌరసేవల చట్టం

### ముఖ్యమంత్రి ప్రకటన

# ఇది సురాజ్య ఉద్యమ విజయం

***ఆగస్టు 9 నుండి డిసెంబర్ 9 వరకు సాగిన తొలిదశ సురాజ్య ఉద్యమంలో హక్కుగా పౌరులకు సేవలు అందించే చట్టం చేయాలన్నది ఒక కీలకమైన డిమాండ్‌గా ఉంది. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్దిష్ట గడువు గల సిటిజన్స్ ఛార్టర్లను ప్రకటించటం, గడువు మీరితే ప్రజలకు పరిహారం చెల్లించటం, ఆలస్యానికి, అలసత్వానికి కారకులైన వారికి జరిమానా విధించటం ద్వారా ప్రజలకు హక్కుగా సేవలు పొందే ఏర్పాటు చేయాలని సురాజ్య ఉద్యమం డిమాండ్ చేసింది. డా॥ జయప్రకాష్ నారాయణ్ సారథ్యంలో ముఖ్యమంత్రిని కలిసిన సురాజ్య ఉద్యమ కమిటీ సభ్యులకు ఈ సమస్యపై సానుకూలంగా వ్యవహరిస్తామని చెప్పిన మాటకు అనుగుణంగా ఇప్పడీప్రకటన వెలువడడం ఆహ్వానించదగ్గ పరిణామం. ఇది సురాజ్య ఉద్యమానికి తొలి విజయం.***

**సకాలంలో పౌరసేవలందించని అధికారులకు జరిమానాలు**

**ఆలస్యం కారణంగా నష్టపోయిన పౌరులకు నష్టపరిహారం**

'మీ సేవ' ద్వారా సకాలంలో పౌరసేవలను అందించని అధికారులకు జరిమానా విధించి, ఆలస్యం కారణంగా నష్టపోయిన పౌరులకు నష్టపరిహారాన్ని చెల్లించనున్నట్లు ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు ప్రభుత్వం త్వరలో చట్టం చేయనుందని తెలిపారు. ఈ పరిపాలన కార్యక్రమంలో భాగంగా 'మీ సేవ' ద్వారా కోటి లావాదేవీలు పూర్తయిన సందర్భంగా జూబ్లీహాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మరో 16 సేవలను (జీహెచ్ఎంసీ -7, పురపాలన-3, రిజిస్ట్రేషన్లు-2, పౌరసరఫరాలు-1, పోలీసు-4. హైదరాబాద్ కలెక్టరేట్-4) ప్రారంభించారు. కొత్తగా ప్రారంభించిన సేవలతో మీసేవ సేవల సంఖ్య 58కి చేరిందనీ... మార్చి నాటికి వీటి సంఖ్యను 100కు పెంచుతామని సీఎం చెప్పారు. ప్రస్తుతం ప్రతిరోజు 70 వేల లావాదేవీలు జరుగుతున్నాయని.. త్వరలో ఈ సంఖ్య లక్షకు చేరుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని మిగతా రాష్ట్రాలు కూడా ప్రారంభించేందుకు ఆసక్తి చూపుతున్నాయని వివరించారు. ఇప్పటి వరకు జరిగిన కోటి లావాదేవీల్లో కొన్ని లావాదేవీల సేవలు సకాలంలో అందించ లేకపోయామని చెప్పారు. భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ప్రతి సేవకు నిర్ణీతగడువు విధించి, నష్టపోయిన వారికి నష్టపరిహారం చెల్లిస్తామని వివరించారు.

మార్చినాటికి ప్రతి జిల్లాలో 200 మీ సేవ కేంద్రాలు ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఐటీశాఖ మంత్రి పొన్నాల లక్ష్మయ్య తెలిపారు. కోటి లావాదేవీలు పూర్తయిన సందర్భంగా సచివాలయ ప్రధాన ద్వారా వద్ద మీ-సేవ డిజిటల్ ప్రకటన బోర్డును ప్రారంభించారు. ఈ బోర్డు ద్వారా ప్రతిరోజు జరిగే లావాదేవీల సంఖ్యను ఎప్పటికప్పుడు ప్రకటిస్తారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నాల లక్ష్మయ్య, మహీధర్‌రెడ్డి, దానం నాగేందర్, ఐటీశాఖ కార్యదర్శి సంజయ్ జాజు, ఈ-సేవ సంచాలకులు గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు. ■

# దారి తప్పిన బాటసారి

## జనం కోణంలో
## బాబు 100 రోజుల పాదయాత్ర



లోక్‌సత్తా పార్టీ 2010 సంవత్సరంలో వివిధ అంశాలపై, వివిధ సందర్భాలలో మీడియాకు విడుదల చేసిన ప్రకటనలని ఒక పుస్తకరూపంలో 'లోక్‌సత్తా పార్టీ మీడియా రిలీజ్‌లు-2010' పేరుతో ఇటీవల విడుదల చేశారు. 16 ఏళ్లకు పైగా లోక్‌సత్తా చెబుతున్న, ఆచరిస్తున్న ప్రత్యామ్నాయ రాజకీయంలో కీలకమైన- స్థానిక ప్రభుత్వాల సాధికారత, అవినీతి నిర్మూలన, విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, నక్సలిజం, మహిళలపై దాడులు, రాజకీయ, పాలనా సంస్కరణలు, తెలంగాణ సహా పలు తక్షణాంశాలపై లోక్‌సత్తా స్పందనలు ఆ ఏడాదికి సంబంధించి అందులో ఉన్నాయి. ఒక రాజకీయ పార్టీ ఏం చెబుతోంది, ఏం చేస్తోంది, కీలకసమయాలలో చెప్పిన మాటలకు ఎలా కట్టుబడి ఉంటోంది, చట్టబద్ధంగా సేకరించిన నిధులతో ఎలా నిర్మాణా త్మకంగా కార్యక్రమా లను చేపడుతోంది, పరస్పర విరుద్ధ ప్రయోజనాలను సమన్వయం చేయాల్సిన పరీక్షా సమయా లలో తన మౌలిక భావజాలం పరిధిని దాటకుండా ఎలా సృజనాత్మకంగా వ్యవహరించ గలుగుతోంది వంటి అంశాలన్నిటినీ ప్రజలకు, కార్యకర్తలకు తెలియచెప్పేందుకు ఆ పుస్తకాన్ని పార్టీ ప్రచురించింది. ఆ పుస్తకాన్ని సంబంధిత కాలమ్‌లో సమీక్షించాలని కోరుతూ లోక్‌సత్తా వలంటీర్‌గా పనిచేసే ఒక సీనియర్ జర్నలిస్ట్ కొన్ని పత్రికలకు ఆ పుస్తకాన్ని ఇచ్చారు. రాజకీయ నేతలకు సంబంధించిన ఇలాంటి పుస్తకాలు బోలెడు వస్తుంటాయి, పార్టీలకు సంబంధించినవి కాబట్టి వాటి గురించి రివ్యూ రాయటం కుదరదు అని ఓ ప్రముఖ పత్రికకు సంబంధించిన పుస్తక సమీక్ష విభాగం ఇంఛార్జి చెప్పారట. ఆయన కూడా సీనియర్ జర్నలిస్టే. మంచి విషయపరిజ్ఞానం ఉన్న వారే. అలాంటి వ్యక్తి కూడా రాజకీయాల్ని, రాజకీయ పార్టీల్ని అంటరానివిగా చూసే దశలోనే ఉండటం, రాజకీయ పార్టీ అంటే రాజకీయ పార్టీ అగ్రనేతే అనే భ్రమలోనే మాట్లాడటం కొంత ఆశ్చర్యాన్ని, బాధని కలిగించాయి. రాజకీయ పార్టీలంటే ఎన్నికలు, గెలుపు ఓటములు మాత్రమే కాదు. అధికారాన్ని ఒక మార్గంగా కాకుండా లక్ష్యంగా భావిస్తే మనం కూడా సమస్యలో భాగమైపోతాం. రాజకీయ పార్టీల రోజువారీ కలాపాలను, అంతర్గత సమావేశాల వివరాలను కాకపోయినా, వాటి నిర్మాణం తీరును, మాటలను, కీలక అంశాలలో వాటి వ్యవహారశైలిని ప్రజలు నిరంతరం గమనిస్తుండాలి, ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఎక్కడికక్కడ రాజకీయాలలో భాగస్వాములవుతుండాలి. ఇందుకు మీడియా తన వంతు ప్రోత్సాహాన్ని, అవకాశాల్ని కల్పించాలిగానీ రాజకీయాల్ని అంటరానివిగా చిత్రీకరించి తోసిపుచ్చే ప్రయత్నం చేయటం అవాంఛనీయ పరిణామం. అందుకే, వివిధ రాజకీయ పార్టీల ప్రచురుణల్ని వక్రీకరణలు లేకుండా లోతైన విశ్లేషణతో, ఆలోచన పెంచేరీతితో ప్రజలలోకి తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేయాలని జర్నలిస్టు మిత్రులందరినీ వినమ్రంగా కోరుతూ, ఈ నేపథ్యంలోనే, రాష్ట్రంలోని ప్రధాన ప్రతిపక్షం తెలుగుదేశం పార్టీకి సంబంధించి జనవరి 9, 2013 చోటుచేసుకున్న రెండు ఘటనలను జన రాజకీయం కోణంలో విశ్లేషించే ప్రయత్నం చేస్తున్నాను.

ఈ ఏడాది జనవరి 9కి టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీరామారావు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి 30 ఏళ్లు పూర్తయ్యాయి. అలాగే చంద్రబాబు నాయుడు వస్తున్నా... మీకోసం పాదయాత్ర 100 రోజులు పూర్తిచేసుకుంది. రెండో

ఘటన ఆరోజున జరగటం యాదృచ్ఛికమంటూనే ఈ రెంటినీ కలగలిపి మీడియా వీటికి విశేష ప్రచారం కల్పించింది. చంద్రబాబు వస్తున్నా... మీకోసం యాత్ర చరిత్రాత్మకం, రాష్ట్ర రాజకీయ చరిత్రలో మైలురాయి, చంద్రబాబుకు వెన్నుదన్నుగా ఎన్టీఆర్ నిలిచివున్నారు, ఎన్టీఆర్‌కు కొనసాగింపుగానే చంద్రబాబు ఉన్నారు అనే భావనలు ప్రజలలో వేళ్లూనుకునేలా చేయటం కోసం ఆరోజున గట్టి ప్రయత్నమే జరిగింది. ఎందుకలా చేశారనే విషయాన్ని పక్కనపెడితే, ఆ ప్రచారంలోని వాస్తవాల్ని ప్రజాప్రయోజనకర కోణంలో విశ్లేషించే ప్రయత్నం చేయటం మాత్రం అవసరం.

ఒక వ్యక్తి 100 రోజులు కష్టపడి నడిస్తే జాలిపడి రాష్ట్ర పాలనాపగ్గాలను అప్పగించేస్తామా అనేది తొలి మౌలికమైన ప్రశ్న. అది కూడా బోలెడంత డబ్బును ఖర్చు పెట్టి. ఇలా జాలిపడో, సెంటిమెంట్లకు కరిగిపోయో ఓట్లు వేసి గతంలో చాలా నష్టపోయాం. ఇప్పటికైనా మేలుకోమా? ఒక పార్టీని, అభ్యర్థిని గెలిపించటానికి జాలి, భక్తి, కృతజ్ఞత వంటివి ప్రామాణికాలు కావని మనం గుర్తించలేమా? ప్రజల జీవితాలు బాగు చేయటానికి, వారు సుఖసంతోషాలతో, శాంతిసామరస్యాలతో జీవించేలా చేయటానికి ఆయా నేతలు చెప్పే విధానాలు, వాటిని అమలుచేయగల నిజాయతీ, అందుకుతగ్గ పార్టీ నిర్మాణం వీటన్నిటినీ బేరీజు వేసుకుని తగినవారికి మాత్రమే ఓటు వేయటం తప్ప మార్గం లేదు.

ఇక విధానాలపరంగా విశ్లేషిస్తే, తన పాదయాత్రలో చంద్రబాబు ఒక్క కొత్త సమస్యను కూడా కనుక్కోలేకపోయారు, ఒక్క కొత్త పరిష్కారం కూడా చెప్పలేకపోయారు. మచ్చుకు మూడునాలుగు ప్రధానాంశాల్ని చూసినా ఈ వాస్తవం తేటతెల్లమవుతుంది.

వ్యవసాయ సంక్షోభానికి పరిష్కారం రైతులకు రుణమాఫీ అంటూ ప్రజలను మళ్లీ పాత రాజకీయం బాటలో మోసాన్నే కొత్తరకంగా చెప్పి ప్రజల్ని నమ్మించేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారు. రైతులు తాము పండించిన పంటలను ఎగుమతి చేసుకోనీయకుండా ఆంక్షల్ని విధించి, లైసెన్స్–పర్మిట్లతో వారిని హింసించి, దళారీలతో కలిసి వారికి రావాల్సిన లాభసాటి ధరకు గండి కొట్టి ఇన్నేళ్లలో కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు రాష్ట్రంలోని రైతులకు కలిగించిన నష్టంతో పోలిస్తే, రుణ మాఫీ బహుస్వల్పం. అసలు సమస్య రుణమాఫీ కాదని, తగిన పెట్టుబడి, తక్కువ ఖర్చుతో ఎక్కువ పంట దిగుబడి సాధించే ఏర్పాటు, పంట ఉత్పత్తులకు గ్యారంటీగా లాభసాటి వచ్చేందుకు ఆంక్షల తొలగింపు వంటి చర్యలు లేకపోవటం వల్ల రైతులు నష్టపోతున్నారని, ఆ తప్పిదాల్ని గుర్తించి వాస్తవ పరిష్కారాలతో వ్యవసాయాన్ని లాభసాటి చేసేందుకు కృషి చేస్తానని మాట మాత్రం కూడా చెప్పేందుకు చంద్రబాబు ప్రయత్నం చేయలేదు.

రైతుల పంటలకు లాభసాటి ధర ఉన్నప్పుడు అమ్ముకునేందుకు కావలసిన గోదాములు, శీతల గిడ్డంగులు తదితర మౌలిక వసతుల ఏర్పాటుకు కీలకమైన ప్రత్యక్ష పెట్టుబడుల విషయంలో కూడా చంద్రబాబు వైఖరి ఘోరంగా, మోసపూరితంగా ఉంది. స్వదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు లేవు కాబట్టి భారతదేశానికి ఇప్పుడు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ)అవసరం. కానీ రైతులలో ఆ విషయంలో అవగాహన ఇంకా లేదు కాబట్టి, అది యూపీయే ప్రభుత్వ విధానం కాబట్టి రైతులకు నష్టం కలిగించైనా ఓట్లు దండుకోవాలన్న తప్పుడు రాజకీయ ధోరణితో చంద్రబాబు ఎఫ్‌డీఐలను వ్యతిరేకించారు. నోటితో రైతుసంక్షేమ జపం చేస్తూ కీలక విధానపరంగా రైతులకు వెన్నుపోటు పొడిచారు. అక్కడితో ఆగకుండా, ఎఫ్‌డీఐలపై ఓటింగ్ సమయంలో రాజ్యసభలోని తమ ముగ్గురు ఎంపీలు గైర్హాజరయ్యేలా చేశారు. పరోక్షంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలోని యూపీయే ప్రభుత్వం నెగ్గేందుకు అవకాశం కల్పించారు. చిత్రవిచిత్రమైన కారణాలతో గైర్హాజరైన ఆ ఎంపీలపై కనీసం చర్యలు కూడా చంద్రబాబు చేపట్టలేదంటే, వారి గైర్హాజరు వెనక చంద్రబాబు ప్రోత్సాహముందని ఇట్టే అర్థమవుతుంది.

మరోవైపు, ఎఫ్‌డీఐలు దేశాభివృద్ధికి అవసరమని తనకు పూర్తి అవగాహన ఉందని, అయితే పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఎఫ్‌డీఐలను వ్యతిరేకించానని తెదేపా రాజ్యసభ ఎంపీ సుజనా చౌదరి డిసెంబర్ 16,2012న ఏబీఎన్ ఆంధ్రజ్యోతి న్యూస్‌ఛానల్‌లో 'ఓపెన్‌హార్ట్ విత్ ఆర్కే' కార్యక్రమంలో తెలిపారు. దేశ ప్రయోజనాలకంటే పార్టీ ప్రయోజనాలే ఎక్కువని, పార్టీ అంటే తన కుటుంబం, బంధుమిత్రులు, లెక్కలుచూపని డబ్బు ఇచ్చే పెట్టుబడిదారులు మాత్రమేనని భావించే నేత చంద్రబాబు అని ఎఫ్‌డీఐల ఉదంతం మరోసారి నిరూపించింది. ఒకపక్క రైతువ్యతిరేక విధానాన్ని చేపట్టి, మరోపక్క ప్రజలను మభ్యపెట్టేలా ఓటింగ్‌కు దూరంగా ఉండి, ఇలా తన అవసరాల కోసం ఎంత మోసపూరిత వైఖరికైనా వెనకాడబోనని ఆయన మరోమారు తేటతెల్లం చేశారు.

తెలంగాణ విషయంలోనైతే కాంగ్రెస్, వైకాపాల బాటలోనే తన దగాపూరిత ద్వంద్వ వైఖరికే కొత్తరంగులద్ది చంద్రబాబు

ఇంకా కొనసాగిస్తున్నారు. డిసెంబర్ 9, 2009న తెలంగాణ ఏర్పాటు ప్రకటన వచ్చాక, ఆ నిర్ణయాన్ని పునస్సమీక్షించాలని ఆ మరుసటిరోజునే ఆయన మీడియా ముందు చెప్పారు. కాబట్టి మళ్లీ ఆయన తెలంగాణపై తన వైఖరిని స్పష్టంగా ప్రకటించాల్సుంది. ఆ పనిచేయకుండా డిసెంబర్, 2012లో ఢిల్లీలో జరిగిన అఖిలపక్ష సమావేశానికి తన ఇద్దరు ప్రతినిధుల ద్వారా తెలంగాణకు అనుకూలంగా 2008లో అప్పుడు కేంద్రమంత్రిగా ఉన్న ప్రణబ్ ముఖర్జీకి ఇచ్చిన లేఖనే మళ్లీ పంపించారు. ఆ లేఖకు కట్టుబడి ఉన్నట్టు కూడా నిర్దిష్టంగా ప్రకటించలేదు. ఆ లేఖను వెనక్కి తీసుకోలేదు అని మాత్రమే చెప్పారు. ఆ తర్వాత జనవరి 9, 2013న ఒక వార్తాఛానల్‌కి ఇంటర్వ్యూ ఇస్తూ తన మనసులోని మాటను బైటపెట్టారు. తెలుగువారి సంక్షేమం కోసం తెలుగుదేశం అని చంద్రబాబు చెప్పే ప్రయత్నం చేస్తున్నప్పుడు, 'ఆంధ్రప్రదేశ్ ఎన్ని రాష్ట్రాలైనా కూడానా' అని ఇంటర్వ్యూ చేసే పెద్దమనిషి ప్రశ్నించారు. దానికి చంద్రబాబు సూటిగా సమాధానమివ్వకుండా, కేంద్రం ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటాం అని దాటవేశారు. ఎన్ని రాష్ట్రాలైనా అని పలకటం కూడా ఆయనకు ఇష్టంలేకపోయింది. తాను స్టేట్స్‌మన్‌ని కాదని, అలా అయ్యే ఉద్దేశం లేదని ఒక్క నిజాన్ని మాత్రం చంద్రబాబు ఈ ఇంటర్వ్యూలో చెప్పారు. ఆమేరకు ఆయన్ని అభినందించాల్సి ఉంది.

అలాగే, తెలంగాణపై ఢిల్లీయే తేల్చాలి అని తన పాదయాత్రలో కొన్ని వందలసార్లు ఆయన చెప్పి ఉంటారు. ఆంధ్రప్రదేశ్ విభజనకి సంబంధించిన అంశాన్ని ఇక్కడి రాజకీయ పార్టీలు తేల్చాలిగానీ, ఢిల్లీ ఎవరు తేల్చటానికి? తెలుగువారి ఆత్మగౌరవాన్ని ఢిల్లీలో తాకట్టు పెట్టారు అని రోజూ మాటల తూటాలు పేల్చే చంద్రబాబుకి, తెలంగాణ విషయంలో తాను తెలుగువారి ఆత్మగౌరవాన్ని ఢిల్లీ వీధుల్లో తాకట్టు పెట్టానని మాత్రం గుర్తురావటం లేదు. తెలంగాణపై అసెంబ్లీలో చర్చించి నిర్ణయించే సత్తా లేని చంద్రబాబుకు, ఎన్టీఆర్ ఇచ్చిన తెలుగువారి ఆత్మగౌరవం నినాదాన్ని ఉచ్చరించే అర్హత ఉందా అన్నది ప్రశ్నార్థకం.

ఇక ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు విషయం. ఆ భారీ ఎత్తిపోతల ప్రాజెక్టుకయ్యే విద్యుత్ ఖర్చు, నిర్వహణ వ్యయం చివరికి తెలంగాణ ప్రజలకు గుదిబండగా మారుతుందని, అది ఏమాత్రం ఆచరణసాధ్యమయ్యే ప్రాజెక్టు కాదని లోక్‌సత్తా తొలినుంచీ వాదిస్తోంది. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును వ్యతిరేకించటమంటే తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడటమే అనే దుష్ప్రచారాన్ని చేస్తున్న తరుణంలో కూడా లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు, కూకట్‌పల్లి ఎమ్మెల్యే డా॥ జయప్రకాష్ నారాయణ్ అటు అసెంబ్లీలో, ఇటు బైట పలుసార్లు నిర్ద్వంద్వంగా వాస్తవాల్ని వెల్లడించి తెలంగాణ ప్రజల ప్రయోజనాల్ని కాపాడే ప్రయత్నం చేశారు. కానీ కాంగ్రెస్, తెలుగుదేశం, జగన్ పార్టీ మూడూ కుమ్మక్కయి కాంట్రాక్టర్ల ప్రయోజనాల్ని కాపాడేందుకు ఆ ప్రాజెక్టుకు అనుకూలంగా మాట్లాడుతూ దాన్ని జాతీయ ప్రాజెక్టుగా మార్చాలనే డిమాండ్ చేస్తూ వచ్చాయి. సుమారు రూ.40,000 కోట్ల వ్యయమయ్యే ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు ద్వారా ఒక ఎకరాకయ్యే విద్యుత్ తదితరాల వ్యయం రూ.30,000 దాటిపోతుంది. రైతు పెట్టుబడి అదనం. ఇంతాచేసి రైతుకు వచ్చే లాభం రూ.10,000 దాటదు. ఈ నష్టాల్ని ఎవరు పూడుస్తారు? దానికి బదులు ఆ ప్రాజెక్టు వ్యయానికయ్యే నిధుల్ని తెలంగాణ ప్రాంతానికే కేటాయించి, ఇతర మార్గాలలో సాగునీటి వసతి, చిన్నపట్టణాల అభివృద్ధి వంటివి చేపట్టి వ్యవసాయాన్ని లాభసాటి చేస్తూ, యువతకు ఉపాధి అవకాశాలను పెంచాలని లోక్‌సత్తా కోరింది. ఇటీవల టీఆర్ఎస్ అధ్యక్షుడు కె. చంద్రశేఖర రావు కూడా ఈ అంశంలో లోక్‌సత్తా వాదనని బలపరుస్తూ మాట్లాడారు.

కానీ కాంగ్రెస్, టీడీపీ, జగన్ పార్టీలు మాత్రం ప్రాణహిత-చేవెళ్ల కోసం పట్టుబడుతూ తెలంగాణ ప్రజల్ని ఇంకా దగా చేస్తున్నాయి. తెలంగాణ జిల్లాలలో తన పాదయాత్ర సందర్భంలోనైనా చంద్రబాబు మారి, వాస్తవాల్ని వెల్లడించి ప్రాణహిత- చేవెళ్లకు ప్రత్యామ్నాయ మార్గాలను సూచించే ప్రయత్నం చేయలేదు.

అదేతీరుగా, తన హయాంలోనే బెల్టుషాపులను ప్రారంభించి తన పార్టీవారితోనే మద్యం అక్రమ సిండికేట్లను నడిపిస్తూ మద్యాన్ని ఏరులై పారించిన చంద్రబాబు, ఈవేళ మద్యం వల్ల కలిగే నష్టాలు కొత్తగా తలెత్తినట్టు మాట్లాడటం విచిత్రం. ప్రజలు ఒకప్పుడు కావాలంటే బెల్టుషాపులను తయారుచేశారా, ఇప్పుడు వద్దంటున్నారు కాబట్టి ఎత్తేస్తామని హామీ ఇస్తున్నారా- ఆయనే వివరించాలి మరి.

గతంలో తప్పులు చేసిన వ్యక్తి ఈవేళ మంచి చేయకూడదని ఎవరూ అనరు. కానీ గతంలో తప్పులేవీ చేయనట్టు చంద్రబాబు మాట్లాడటం, తాను చేసిన తప్పుల ఫలితాలు కళ్లెదురుగా కనిపిస్తున్నా కూడా క్షమాపణ చెప్పకపోవటం, ఇతరుల మీద

నిందారోపణలు చేసేయటం, పాత తప్పిదాలనే కొత్త పరిష్కారాలుగా ప్రచారంచేస్తూ నమ్మించే ప్రయత్నం చేయటం, ఏదోకరకంగా అధికారం వస్తే చాలు అనుకోవటం వంటివి మాత్రం క్షమార్హం కాదు. ఆయన అనుసరిస్తున్న తీరు మున్ముందు తెలుగు జాతిప్రయోజనాలను తీవ్రంగా దెబ్బతీస్తుంది. ఇలా ఆయన వందరోజులుకాదు, వెయ్యిరోజులు పాదయాత్ర చేసినా ప్రజలకు కలిగే ప్రయోజనం శూన్యం. తెలంగాణపై కూడా ఆయన పార్టీ ఏ వైఖరైనా తీసుకోవచ్చు. కానీ ఆ విషయాన్ని మాత్రం ప్రజలకు స్పష్టంగా అర్థమయ్యేలా చెప్పి అందుకు కట్టుబడాల్సిన బాధ్యత చంద్రబాబు మీద ఉంది. ఏదో చెప్పేసినట్టు ప్రచారం చేసేసుకుని ప్రజల్ని నమ్మించగలిగామనుకోవటం భ్రమ అని కాస్త ఆలస్యంగానైనా రుజువవుతుంది. అధికారం లక్ష్యం కాదు, కొన్ని లక్ష్యాలు నెరవేర్చటానికి ఒక మార్గం మాత్రమే ఆయన స్పష్టంగా గుర్తించాలి.

మరోవైపు, ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసి మూడు దశాబ్దాలు గడిచిన సందర్భంగా కూడా ఆయనను ఒక హీరోగా కీర్తిస్తూ ఆయన ఇమేజ్ వారసత్వాన్ని సొంతం చేయటం, సొంతం చేసుకోవటం కోణంలో ప్రచారం జరిగిందితప్ప, ఆయన విధానాలపరంగా చర్చ జరగలేదు. అధికారాన్ని వికేంద్రీకరించి ప్రజల వద్దకు తీసుకెళ్లేందుకు రామారావు మంచి ప్రయత్నం చేశారు. అవినీతి నిర్మూలనకు వ్యవస్థాగత ఏర్పాట్లు చేశారు. మహిళల హక్కుల పరిరక్షణకు చట్టపరమైన ఏర్పాట్లు చేయటం, సహకారసంస్థలను పెంచిపోషించే మ్యాక్స్ చట్టం తీసుకురావటం వంటివి ఆయన హయాంలోనే జరిగాయి. ఆ మార్పులను ఇప్పటికైనా సరైనరీతిలో పూర్తిస్థాయిలో చేపట్టాల్సి ఉంది. కానీ అవేవీ ఈ జనవరి 9న చర్చకు రాలేదు. ఎన్టీఆర్ పేరును వాడుకుందామని చూస్తున్న ఆయన అల్లుళ్లు, కొడుకులు, కూతుళ్లు, మనవళ్లు కూడా ఈ దిశగా ఎక్కడా మాట్లాడలేదు. చంద్రబాబు సైతం, రాష్ట్రంలో పెచ్చరిల్లుతున్న అవినీతి నిర్మూలన గురించి మాట్లాడారుగానీ, అందుకు ఎన్టీఆర్ ఏర్పాటు చేసిన లోకాయుక్తను ఇప్పటికైనా బలోపేతం చేస్తానని చెప్పలేదు. లోక్‌పాల్ కోసం అన్నా హజారే ఉద్యమానికి మద్దతు పలికిన తెదేపా అధ్యక్షుడు, రాష్ట్రంలో అదేతరహాలో బలమైన లోకాయుక్త ఏర్పాటుకు మాత్రం అడ్డంకొట్టారు. లోక్‌పాల్‌తోపాటు బలమైన లోకాయుక్త అనే ఏర్పాటుకు వ్యతిరేకంగా టీడీపీ ఎంపీలు పార్లమెంటులో ఓటు వేశారు.

ఈ కొన్ని అంశాలను పరిశీలిస్తే చాలు- ఇప్పుడున్న తెలుగుదేశం, ఎన్టీరామారావు ఆనాడుస్థాపించిన తెలుగుదేశం కాదని అర్థం చేసుకోవటానికి. కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా ఎన్టీఆర్ ఒక ప్రభంజనంలా వచ్చి 1983లో అధికారం చేపట్టారు. వెనకబడిన వర్గాలకు రాజకీయాధికారం అందించేందుకు, ప్రజల చేతిలోకి అధికారం తీసుకెళ్లేందుకు, అవినీతి నిర్మూలనకు, మహిళల అభ్యున్నతికి తన పరిధిలో ప్రయత్నించారు. ప్రజలకు ఎంతో మేలుచేసే ఆ విధానాల మార్గానికి ప్రస్తుత తెలుగుదేశం తిలోదకాలిచ్చి కేవలం ఎన్టీఆర్ ఇమేజ్‌ని ఓట్లకోసం వాడుకోవటానికి పరిమితమైంది. ఎన్టీఆర్ భాషలో చెప్పాలంటే, చెట్టు పేరు చెప్పి కాయలమ్ముకుంటోంది. ఈవేళ తెలుగుదేశం, కాంగ్రెస్, వైకాపాల మధ్య ఎటువంటి తేడా లేదు. వీలున్నప్పుడల్లా కుమ్మక్కయి తమ స్వార్థప్రయోజనాలు నెరవేర్చుకుంటూ పైకి మాత్రం అధికారం కోసం ప్రత్యర్థుల్లా కనిపించేందుకు ఆ పార్టీలు తాపత్రయపడుతున్నాయి.

ప్రపంచీకరణ, జనాభాలో మూడొంతుల యువత, విస్తృత శాస్త్రసాంకేతిక పరిజ్ఞానంతో ప్రజల్లో వెల్లివిరుస్తున్న చైతన్యం వంటి కారణాల వల్ల ఈవేళ మన రాష్ట్రంలో, దేశంలో ఎన్నడూలేనిస్థాయిలో అవకాశాలు, సవాళ్లు పోటీపడుతున్నాయి. ఈ పరిస్థితిని ఒక అవకాశంగా మార్చుకుని, వివక్షలేకుండా అందరికీ ఎదిగే అవకాశాలు గల వ్యవస్థను నిర్మించాలంటే, కాంగ్రెస్, తెదేపా, వైకాపాలాంటి పార్టీల సాంప్రదాయ రాజకీయంతో సాధ్యం కాదు. అలాగే ఎన్టీఆర్ విధానాలు, ఆలోచనాస్థాయి కూడా ఈవేళ చాలవు. ప్రతి ఒక్కరి అభివృద్ధికీ గ్యారంటీ ఇచ్చే అలాంటి వ్యవస్థ నిర్మాణం ప్రత్యామ్నాయ రాజకీయ విధానాలు, రాజకీయ సంస్కృతి కలిగిన పార్టీతో మాత్రమే సాధ్యమవుతాయి. ఆ ప్రత్యామ్నాయ రాజకీయం చేస్తున్న పార్టీ ఏది అనేది మన అంతరాత్మలకు స్పష్టంగా తెలుసు.

ప్రజాస్వామ్యంలో అంతిమంగా ప్రజలే ప్రభువులు. ప్రజలు తల్చుకుంటేనే మార్పు సాధ్యం. ఎన్టీరామారావా, చంద్రబాబు నాయుడా, చిరంజీవా, జయప్రకాష్ నారాయణా అని ఆలోచించకుండా, తమ అభివృద్ధికి, తమ బిడ్డల ఉజ్వల భవిష్యత్తుకు ఉపయోగపడే విధానాలు, నిర్మాణం ఉన్న రాజకీయ పార్టీకి ఓటు వేయటం, ఇతరత్రా రూపాలలో అండగా నిలవటం ప్రజలు ఒక జీవనశైలిగా మార్చుకుంటేనే మన రాష్ట్రంలో, దేశంలో అసలైన మార్పు మొదలవుతుంది. ■

**-21వ శతాబ్దపు భారతీయుడు**

# గుజరాత్, హిమాచల్ ఎన్నికల్లో పెయిడ్ న్యూస్



ఇటీవల జరిగిన గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో మీడియాలో చెల్లింపు వార్తల జాఢ్యం భారీయెత్తున విస్తరించిన వైనాన్ని తాము గమనించినట్లు ప్రెస్‌కౌన్సిల్ ఛైర్మన్ జస్టిస్ మార్కండేయ కట్జూ పేర్కొన్నారు. ప్రింట్ మీడియాతో పాటు ఎలక్ట్రానిక్ మీడియాలో కూడా ఈ చెల్లింపు వార్తల జాఢ్యం వ్యాపించిన విషయాన్ని తమ బృందం గమనించిందని ఆయన జనవరి 12న మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో వివరించారు. హిమాచల్‌ప్రదేశ్ ఎన్నికల్లో చెల్లింపు వార్తల విధానం విరివిగా అమలులో వున్నట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో రాజీవ్ రంజన్ నేతృత్వంలో పరిశీలక బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ బృందం తన నివేదికను జనవరి 12నాడు ప్రెస్‌కౌన్సిల్‌కు అందచేసింది. పెయిడ్ న్యూస్ జాఢ్యం విస్తృతంగా వ్యాపించిన విషయం నిజమేనని బృందం నిర్ధారించినట్లు కట్జూ వివరించారు. ఈ నివేదికపై ప్రెస్‌కౌన్సిల్‌లో విస్తృతంగా చర్చించిన అనంతర ఏకగ్రీవంగా ఒక నిర్ణయం తీసుకుంటామని, ఇటువంటి విధానాలు అనుసరించే అభ్యర్థులపై అనర్హత వేటు వేయాల్సిందిగా సిఫార్సు చేస్తామని కట్జు తెలిపారు. గత ఏడాది జరిగిన యుపి ఎన్నికల్లో ఒక ఎమ్మెల్యే ఈ చెల్లింపు వార్తల విధానానికి పాల్పడినట్లు రుజువు కావటంతో ఎన్నికల కమిషన్ ఈ ఎన్నికను రద్దు చేసిందని కట్జూ గుర్తుచేశారు. ఎలక్ట్రానిక్ మీడియాను సైతం ప్రెస్‌కౌన్సిల్ పరిధిలోకి తీసుకురావాల్సిన అవసరం వుందని దీనితో పాటు మీడియా స్వీయనియంత్రణ పాటించాల్సిన అవసరం వుందని ఆయన అభిప్రాయపడ్డారు.

# పరిశ్రమలకు నైతిక నియమావళి

**జాతీయ మానవ హక్కుల సంఘం**

జాతీయ మానవ హక్కుల సంఘం దేశంలోని పరిశ్రమలకు 12 అంశాలతో కూడిన నైతిక నియమావళిని విడుదల చేసింది. ఇందులో స్థానికులకు ప్రాధాన్యం ఇవ్వడం, కులమతాలకు అతీతంగా ఉద్యోగులందరికీ సమాన అవకాశాలు కల్పించడం వంటి అంశాలున్నాయి. దేశంలోని పరిశ్రమల్లో నైతిక, సామాజిక అంశాలపై అధ్యయనం కోసం హక్కుల సంఘం, ఒక సంఘాన్ని ఏర్పాటు చేసింది. జనవరి 11న తన నివేదికను సమర్పించింది. చాలా పరిశ్రమలు, సంస్థల్లో సామాజిక, నైతిక విషయాలు నిరుత్సాహకరంగా ఉన్నాయని తెలిపింది. ఆ నియమావళి ప్రకారం... పరిశ్రమలు తమ వాణిజ్య విధానాన్ని తుచ తప్పకుండా అనుసరించాల్సి ఉంటుంది. అన్ని సంస్థలూ తాము చేపట్టే ప్రాజెక్ట్‌లు, పనుల్లో స్థానిక సంస్కృతి, సంప్రదాయాలు, ప్రజలను గౌరవించాలి. సంఘటిత అభివృద్ధికి వీలుగా కులం, మతం, లింగం, ప్రాంతం, వంటి బేధాలను పక్కన పెట్టి అన్ని కంపెనీలూ అర్హత ఉన్న ఉద్యోగులందరికీ ఒకే రకమైన అవకాశాలు కల్పించాలి. ఉద్యోగులకు సురక్షిత, ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన పని వాతావరణాన్ని కల్పించాలి. ఈ నివేదిక వివరాలను హక్కుల సంఘం ఒక ప్రకటనలో వెల్లడించింది.

# భారత్ ఆర్థిక స్వాతంత్ర్యం అధ్వానం

**177 దేశాల్లో భారత్‌కు 119వ స్థానం**

ఆర్థిక స్వాతంత్ర్యం విషయంలో భారత్ అధ్వాన స్థితిలో వున్నట్లు వెల్లడైంది. 177 దేశాల్లో భారత్‌కు 119 స్థానం దక్కిందంటే పరిస్థితి ఎలా ఉందో తెలుసుకోవచ్చు. ప్రపంచ దేశాల ఆర్థిక స్వాతంత్ర్యంపై 'హెరిటేజ్ ఫౌండేషన్' అధ్యయనం నిర్వహించింది. 2013 సంవత్సరపు నివేదికను విడుదల చేసింది. హాంగ్‌కాంగ్, సింగపూర్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, స్విట్జర్లాండ్, కెనడా, చిలీ, మారిషస్, డెన్మార్క్, అమెరికా దేశాలు మొదటి 10 స్థానాల్లో నిలిచాయి. నిత్య సంక్షోభ దేశాలైన అఫ్గానిస్థాన్, ఇరాక్, కొసావో, లిబియా, లీచ్‌టెన్‌స్టెయిన్, సోమాలియా, సూడాన్, సిరియాలకు ఎలాంటి స్థానం దక్కకపోవడం గమనార్హం. చైనా, రష్యాలు, భారత్ కంటే దిగువస్థాయిలో ఉండడం విశేషం. ఫిలిప్పైన్స్, టాంజానియా, ఫిజీ, ఒమన్, పెరూ తదితర దేశాల కంటే భారత్ ర్యాంకు దిగువలోనే ఉంది. ఆసియా-పసిఫిక్ ప్రాంతంలోని 41 దేశాల్లో భారత్‌కు 23వ స్థానం దక్కింది. ఆర్థిక స్వాతంత్ర్యంలో భారత్55.2 స్కోర్ సాధించింది.

# వ్యవసాయం వాటా మరింత తగ్గుదల

**- 2017 నాటికి రాష్ట్ర ఆదాయంలో 16 శాతమే**

పన్నెండో పంచవర్ష ప్రణాళిక (2012-17) కాలం చివరినాటికి రాష్ట్ర ఆదాయంలో వ్యవసాయ రంగం వాటా 16 శాతానికి తగ్గనుంది. సేవల రంగం వాటా మరింతగా పుంజుకొని 59 శాతానికి చేరుకోనుంది. అన్ని రంగాల్లోనూ సగటున 10% వార్షిక వృద్ధిని సాధించాలని, రాష్ట్రం లక్ష్యంగా పెట్టుకొంది. ఈ అంచనాలతోనే రూ.3.42 లక్షల కోట్లతో పంచవర్ష ప్రణాళిక లక్ష్యాలను రూపొందించింది. దీనికి అనుగుణంగానే 2013-14 వార్షిక ప్రణాళికను వెలువరించనుంది. రాష్ట్రంలో 11వ పంచవర్ష ప్రణాళిక కాలంలో వ్యవసాయం, పరిశ్రమలు, సేవారంగాల్లోని మొత్తం ఆదాయంలో 8.33% వృద్ధి మాత్రమే నమోదైంది. కానీ ఇప్పుడు ఏకంగా 10% వృద్ధి లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇది సాధ్యమైతే 2016-17 చివరినాటికి తలసరి ఆదాయం రూ.1,53,811కి పెరుగుతుందని అంచనా. పంచవర్ష ప్రణాళికకు సంబంధించి తమ లక్ష్యాలను రాష్ట్ర ప్రభుత్వం తాజాగా జాతీయ అభివృద్ధి మండలి సమావేశంలో వెల్లడించింది. దీని ప్రకారం మూడు రంగాల్లోని మొత్తం ఆదాయం 2004 ధరల ప్రకారం చూస్తే రూ.6.61 లక్షల కోట్లకు చేరుతుందని అంచనా వేసింది. ఇందులో వ్యవసాయ రంగం 16% పరిశ్రమలు 25%, సేవలు 59% వాటాలను కలిగుంటాయి. రాష్ట్రంలో ఇప్పటికీ అత్యధిక మంది వ్యవసాయంపైనే ఆధారపడి ఉండగా రాష్ట్ర ఉత్పత్తి (జీఎస్‌డీపీ)లో మాత్రం దాని వాటా తగ్గి మిగతా రంగాల వాటాలు పెరుగుతుండటం విశేషం. అనుకున్న వృద్ధిరేటు సాధించాలంటే వివిధ రంగాల్లో ఇప్పటికన్నా ఎక్కువగా కృషి చేయాల్సి ఉంటుంది. ఆహార ధాన్యాల ఉత్పత్తి ప్రస్తుత 204 లక్షల టన్నుల నుంచి 3 లక్షల టన్నులకు పెరగాలి. 40 లక్షల మందికి ఉపాధి లభించాలి. విద్యుత్తులో 9% మేర ప్రగతి సాధించాల్సి ఉంది. 12వ పంచవర్ష ప్రణాళిక రాష్ట్ర లక్ష్యాలను తొలిసారిగా చాలా సమగ్రంగా రూపొందించామని ప్రణాళికశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.పి.టక్కర్ 'ఈనాడు'కు తెలిపారు. వచ్చే ఐదేళ్లలో దీనికి అనుగుణంగానే వార్షిక ప్రణాళికలు ఉంటాయన్నారు.

**రాష్ట్రంలో వివిధ పంచవర్ష ప్రణాళిక కాలాల్లో వృద్ధి రేటు ఇవీ (శాతాల్లో)**

| పంచవర్ష ప్రణాళి | వ్యవసాయం | పరిశ్రమలు | సేవలు | మొత్తం |
|---|---|---|---|---|
| 9వ ప్రణాళిక | 3.9 | 5.1 | 7.4 | 5.59 |
| 10వ ప్రణాళిక | 4.0 | 10.2 | 9.5 | 8.19 |
| 11వ ప్రణాళిక | 5.4 | 8.2 | 9.6 | 8.33 |
| 12 ప్రణాళిక (అంచనా) | 6.0 | 10.5 | 11.5 | 10.00 |

# ఎక్కడకి పోతున్నాం?

రాతియుగం నుండి రాకెట్‌యుగందాక వచ్చాం
ఆకులు కట్టుకొనే దశ నుండి చక్కని దుస్తులు ధరిస్తున్నాం
అజ్ఞానాంధకారం నుండి విజ్ఞాన కాంతి వైపు పమనిస్తున్నాం
ఓనమాలు తెలియని కాలం నుండి
విశ్వ రహస్యాల్ని శోధించే స్థాయికొచ్చాం
ష్...... ఏం లాభం
కులాల కుళ్లును వదలలేకున్నాం
మతాల మౌఢ్యాన్ని వీడలేకున్నాం
సమానత్వాన్ని సాధించకున్నాం
మానవత్వాన్ని మరచిపోతున్నాం
అవినీతికి పట్టం కడుతున్నాం
అన్యాయం వెంట నడుస్తున్నాం
అధర్మాన్ని ఎదిరించలేకున్నాం, అక్రమాన్ని అడ్డుకోకున్నాం
ఏం సాధించాం...? మన గమ్యం ఎటు వైపు
మన పయనం పురోగమనమా ! తిరోగమనమా!

- ఆచార్య గిడ్డి వెంకట రమణ

# వీరవనితా మేలుకో !

చదువుకున్న నేటి సమాజపు చీడపురుగుల్ని
భీ కొట్టటానికి నడుంబిగించు!

నిప్పులు చెరిగే కళ్ళతో శక్తి స్వరూపమై అవతరించు!
నీ ఆత్మ విశ్వాసాన్ని దెబ్బకొట్టే నీచ సంస్కారాల్ని
నిలువుగా దహించు!

నరరూప రాక్షసుల గుండెల్లో గునపంలా గుచ్చుకొనే
త్రిశూలమై కనిపించు!

ఏమీ చేయలేవనుకునే 'నీవు ఏమైనా చేయగలవన్న
భయంతో వణికించు!
మనోధైర్యమే నీ ఆయుధంగా ఉన్మాదపు ప్రవృత్తిని ఎదిరించు!
ఆడదాన్ని ఆటబొమ్మగా వేటాడే దారుణ సంస్కృతిని
కూకటి వేళ్లతో పెకలించి
అసభ్య సమాజపు తలరాతను తిరగరాయి!

నీతో చెలగాటం! ఎంత ప్రమాదకరమైనవో - అసలు నువ్వేంటో
ఈ లోకానికి నిరూపించు!

- కె. సుదర్శనరేవతి

# పాఠకుల స్పందన

జనవరి 1-15 లోక్‌సత్తా టైమ్స్ పత్రికలో "పుస్తక సమీక్షలను" గురించి రాచమల్లు రామచంద్రారెడ్డి రాసిన వ్యాసం అక్షరాలా నిజానికి అద్దం పట్టింది. వారు చెప్పినట్టు పుస్తక సమీక్ష చేయడానికి ఒక అర్హత వుండాలి. కానీ ఆ అర్హతను నిర్వీర్యం (చాలామంది పుస్తక ప్రచురణ కర్తలు, ఒకోసారి రచయిత) చేయడం మామూలు. నేను కొన్ని వేల పుస్తకాలను ఆమూలాగ్రం చదివి నాకు నచ్చినవి మాత్రమే సమీక్ష చేస్తాను. అయితే ఏ ప్రతికా రచయితా నన్ను సమీక్షించమని అడగరు. పాఠకులు చదవాలనే ఆకాంక్షతో స్వంతంగా రాస్తుంటాను. ఇందులో ఎవరి ప్రోద్బలమూ వుండదు. మనసుకు నచ్చింది మరెందరో చదవాలని కోరుకుంటాను. మంచి పుస్తకానికి అసలైన నీరాజనంగా నేను భావిస్తాను. పుస్తకపఠనం అనేది ఎంతటి జ్ఞానం పంచుతుందో చదివే పాఠకులకు మాత్రమే తెలుస్తుంది.

- ఎ. అన్నపూర్ణ, హైదరాబాద్

# మన తీరు మారాలి

కె. సుదర్శనరేవతి

విద్యా వైద్య సాంకేతిక పరిజ్ఞానం ఎంతగానో అభివృద్ధి చెందిన ఆధునిక యుగంలో మన నైతిక విలువలు దారుణంగా పతనమైపోవటం చాలా విచారించదగ్గ విషయం. సమాజంలో అవినీతి, అన్యాయం, అక్రమం, లంచగొండితనం ఒకవైపు ఆర్థిక ప్రగతికి అవరోధంగా నిలిస్తే, మరోవైపు మహిళల పట్ల జరుగుతున్న హింస, అత్యాచారాలు, దౌర్జన్యాలు, దురాగతాలు మన సంస్కృతికే విఘాతంగా నిలుస్తున్నాయి. ఇ టీవల జరిగిన ఢిల్లీ అత్యాచార సంఘటన యావత్ భారతదేశాన్ని కలచివేసింది. అసలు మన సమాజం ఎటు పోతుంది? మనమేమై పోతున్నాం?

మన నాగరిక ప్రపంచంలో నీతినిజాయితీ, న్యాయధర్మం అనే భావనలు విద్యార్థి దశ నుంచే నాటుకోవాలి. ఇందులో తల్లిదండ్రులు, గురువుల పాత్ర ఎంతైనా ఉంది.

నైతిక విలువలు పెంపొందించలేని అభివృద్ధికి అర్థం వుండదు. మన తీరు మారకపోతే, అర్థరాత్రి స్వాతంత్ర్యం సంగతేమోగానీ, కనీసం పట్టపగలు స్వాతంత్ర్యం అయినా నిలుపుకోటానికి ప్రతిదినం ఆ పరమాత్ముడిని ప్రార్థించుకోవాల్సి వస్తుంది.

# ఏడ్పు

షేక్ కరీముల్లా, వినుకొండ
సెల్ : 94415 02990

ఎవ్వరికోసం
ఎవరూ ఏడ్వని చోట
మనం అంగళ్ళలో తప్ప
అనుబంధాల్లో లేనిచోట
అందమైన అంతిమయాత్రనైనా
కలగనాలంటే
శ్మశానాల్లోనైనా మనిషిజాడల్ని
వెతకాలంటే
సమిష్టిగా ఏడ్వాల్సిందే
ఏడుపు రాకపోవటం
ఆరోగ్య లక్షణమేమీ కాదు
ధీరత్వం అంతకన్నా కాదు
ఏడ్పు ఆస్తిత్వం చిహ్నం
ఓదార్పుకోసమైనా
పలుకులు పెగలని చోట
మనం నిలువెత్తు గానమై
నాల్గు చెరుగులా విరబూయాలంటే
బిగ్గరగా ఏడ్వాల్సిందే
మొద్దుబారిన మన రహస్య చర్మాల్లో
గోర్వెచ్చని నెత్తురు నింపాలంటే
ఏడ్పును సూచిమొనలా గుచ్చాల్సిందే
వేడగాడి తూటా దెబ్బకు
గాయపడ్డ పాలపిట్టలా
మనసు వరంగాలో వాలిన
పాటనో, పద్యాన్నో
అరచేతుల్లో తీసుకుని
దాని ఏడుపు భాసను వినాల్సిందే
పొత్తిళ్ళలో బిడ్డ ఉనికి
అర్థమయ్యేది ఏడుపులోనే కదా!
ఏడ్పు ఒక లయ
సర్రున తీకే ఒడిసెల రాయి
ఒక పోరాట రూపం

# ప్రతి మనిషి అనుకోవాలి

రచన: సూరంపూడి విశ్వం, తణుకు

ప్రతి మనిషి అనుకోవాలి
ప్రతి నిమిషం తలపోయాలి ॥ ప్రతి మనిషి ॥

కన్నబిడ్డలా పెరిగే చెట్టుని
గుమ్మ పాలాలా తీయని నీటిని
అమ్మ పాటలా చల్లని గాలిని
మధనం చేస్తే అమృతం
మలినం చేస్తే కాలుష్యం అని ॥ ప్రతి మనిషి ॥

చెట్టు నీరు గాలి
ప్రకృతి ఒసగిన వరాలు మూడని
అవి మన మనుగడకే మూలమని ॥ ప్రతి మనిషి ॥

చెట్టు నీరు గాలి
ప్రకృతి ఒసగిన తరగని గనులవి
ఆ గని సంపద పెంచాలని
అందరికీ అది పంచాలని
ప్రతి మనిషి అనుకోవాలి
ప్రతి నిమిషం తలపోయాలి

# గిడ్డి నానీలు

- ఆచార్య గిడ్డి వెంకట రమణ

నల్లధనంతో
నేతలు 'కళ కళ'
పేదల మోములో
లేదు కళ

ప్రజల సొమ్ము
నేతల పాలు
పథకాలన్నీ
నేలపాలు

నోటిస్తేనే
ఓటు
అవినీతికదే
అసలైన రూట్

అవినీతికి
అందలం
ఆర్థిక వ్యవస్థ
అతలాకుతలం

గుర్రమే
నత్తనడక నడుస్తుంది
మేతలో కోత
అవినీతి కథే

నేటి రాజకీయాలలో
నీతి కనుమరుగు
అవినీతి మాత్రం
పరుగే పరుగు

# లోక్‌సత్తా పార్టీ సంస్థాగత ఎన్నికలు గడువులోగా సభ్యత్వ ఫారాలు పంపండి

**లోక్‌సత్తా సంస్థాగత ఎన్నికల్లో భాగంగా జరుగుతున్న సభ్యత్వ నమోదు కార్యక్రమం జనవరి 31వ తేదీతో ముగుస్తుంది. పూర్తి చేసిన సభ్యత్వాన్ని సకాలంలో కేంద్ర కార్యాలయానికి పంపాలి. సకాలంలో చేరిన సభ్యులకు మాత్రమే సంస్థాగత ఎన్నికల్లో పాల్గొనే అవకాశం వుంటుంది. చివరి నిమిషందాకా వేచి వుండక, వెంటనే సభ్యత్వ ఫారాలను, సభ్యత్వ రుసుంను పంపించాల్సిందిగా కోరుతూ డా॥ జయప్రకాష్ నారాయణ్ ఇచ్చిన మార్గదర్శకాలను ప్రచురిస్తున్నాం.**

**1.** 2013 ఫిబ్రవరిలో లోక్‌సత్తా పార్టీ సంస్థాగత ఎన్నికలు ప్రారంభం కానున్నాయి. ఈ సంస్థాగత ఎన్నికలను పూర్తిగా పార్టీయేతరమైన స్వతంత్ర ప్రతిపత్తి గల ఎన్నికల అథారిటీ నిర్వహిస్తుంది. శ్రీ కాకి మాధవరావుగారు ఛైర్మన్‌గా ఈ ఎన్నికల అథారిటీని ఏర్పాటుచేయడం జరిగింది.

ఈ ఎన్నికల అథారిటీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన **జిల్లా రిటర్నింగ్ అధికారులను** వారే నియమిస్తారు.

**2.** చేర్పించిన సభ్యత్వ ఫారాలను గడువులోగా పంపండి

ఎ) జనవరి 31వ తేదీ సభ్యత్వం చేర్చడానికి తుదిగడువుగా నిర్ణయించుకున్నాం.

చేర్పించిన సభ్యత్వాన్ని ఎప్పటికప్పుడు రాష్ట్ర కార్యాలయానికి పంపించండి. నగదు, ఫారాలలో ఏది లేకపోయినా వాటిని స్వీకరించటం సాధ్యపడదు.

బి) రాష్ట్ర కార్యాలయంలో నేరుగా అందించేవారు ఫిబ్రవరి 1వ తేదీ సా॥ 5 గంటలులోగా స్వయంగా లేదా ఎవరిద్వారానైనా నగదు, సభ్యత్వ ఫారాలను అందించవచ్చు. ఆ తర్వాత స్వీకరించడం సాధ్యపడదు.

సి) కొరియర్, పోస్టు ద్వారా పంపేవారు ఫిబ్రవరి 1వ తేదీన పంపినట్లు రశీదు/ముద్రతో వుంటే స్వీకరించడం జరుగుతుంది. తర్వాత తేదీలతో వున్న కొరియర్ / పోస్టులను స్వీకరించడం సాధ్యపడదు.

అందుచేత సభ్యత్వ ఫారాలను, రుసుమును సకాలంలో అందించి చేరిన సభ్యులంతా సంస్థాగత ఎన్నికల ఓటర్ల జాబితాలో నమోదు అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.



సూచన: మీరు, మీ స్నేహితులు ఎవరైనా లోక్‌సత్తా పార్టీలో చేరదలచుకుంటే ఇక్కడ పొందుపరచిన సభ్యత్వ ఫారాన్ని ఉపయోగించుకోవచ్చును. పూరించిన దరఖాస్తును ఇం.నం. 8-2-674బి/2/9, ప్లాట్ నం. 93హ్యాపీవ్యాలీ, రోడ్‌నం.13ఎ, బంజారాహిల్స్, హైదరాబాద్ - 500 034 రాష్ట్ర కార్యాలయానికి పంపించండి.

APPLICATION NO.:
LSP/PRI/

**Rs. 100/-for 3 Years.**
(Rupees one hundred only, for three years)

## LOK SATTA PARTY
New Politics for a New Generation

**ACTIVE MEMBERSHIP**
Application Form

PHOTO

FULL NAME
........................................................................
FAMILY NAME　　　　NAME

### PERSONAL DETAILS

DATE OF BIRTH : _____/_____/________ (dd / mm / yyyy)

GENDER: M ☐ F ☐

MARITAL STATUS:
☐ Single ☐ Married

SOCIAL CATEGORY (for statistic purpose only)
☐ O.C ☐ S.C ☐ S.T
☐ B.C ☐

EDUCATIONAL QUALIFICATION : ________________

PROFESSION: ____________________

GROSS ANNUAL INCOME:
______________________________

### CONTACT DETAILS

H.NO: ______________________ STREET NAME: ____________________________

AREA: __________________________ PIN: ______________________

MANDAL/DIVISION: ______________________ DISTRICT : ______________________

ASSEMBLY CONSTITUENCY: ______________________________________

POLING STATION NAME / No. : ______________________ STATE: ______________________

TEL: ______________________ MOBILE: ______________________

EMAIL: ______________________________________

Referred by: ______________________________

His/Her ID No.: ______________________________

**Volunteer Name :** ______________________________

Ph. No. : ________________ Signature: ____________

**UNDERTAKING**

I confirm that the information furnished above is true to the best of my knowledge and that I read the terms & conditions set forth in the membership document and I shall abide by the same and shall be subject to the disciplinary code of the party. I affirm that I do not have any criminal record on me. I have paid the prescribed membership fee.

DATE: ________________ SIGNATURE: ______________________

# సమస్యలు పరిష్కరించే పార్టీలు కావాలి: జేపీ



రాష్ట్ర ప్రజల సమస్యలను పరిష్కరించే రాజకీయ పార్టీలు కావాలని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. సి క్యాంపు సెంటర్‌లో లోక్‌సత్తా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జేపీ ప్రారంభించారు. అనంతరం లలిత కళాసమితిలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత రాజకీయ పార్టీల నాయకత్వం వంశపారంపర్యంగా కొనసాగుతోందే తప్ప ప్రజల సమస్యలను తీర్చడంలో ఘోరంగా వైఫల్యం చెందిందని విమర్శించారు. కాంగ్రెస్‌లో సోనియాగాంధీ తరువాత రాహుల్‌గాంధీ, తెలుగుదేశం పార్టీలో చంద్రబాబు తరువాత లోకేష్‌ను, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో జగన్, టీఆర్ఎస్ పార్టీలో చంద్రశేఖర్‌రావు తరువాత ఆయన కుమారుడు తారక రామారావును రాజకీయాలలోకి తీసుకురావాలని ముందస్తు ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. ఆ పార్టీల కార్యకర్తలు జెండాలు మోసే బోయిలుగానే మిగిలిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు పంటలు లేక కన్నీరు కారుస్తుంటే పాలకులు మాత్రం వికటాట్టహాసం చేస్తున్నారని అన్నారు. పేదల గురించి మాట్లాడడం తప్ప పేదరిక నిర్మూలనకు కృషి చేయడం లేదని దుయ్యబట్టారు. కూలీ కొడుకు కలెక్టర్ కావాలంటే రాజకీయ నాయకులు అడ్డుపడుతున్నారన్నారు. దేశంలో ఆడపిల్లలకు భద్రత లేకుండా పోయిందన్నారు. పోలీసు స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ చేస్తారన్న గ్యారంటీ లేదు. సాక్ష్యాలతో కోర్టులో ప్రవేశపెడతారన్న నమ్మకం లేదు. తక్షణమే మహిళలకు రక్షణ చట్టం కల్పించాలన్నారు. ప్రభుత్వ దుర్మార్గపు పనులకు స్వస్తి చెప్పడానికే సురాజ్య ఉద్యమం చేపట్టామని అన్నారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఓంకార్, జిల్లా అధికార ప్రతినిధి డా॥ కె. పద్మన్న, జిల్లా కార్యదర్శి లక్ష్మీపురం డేవిడ్, బండారు రామ్మోహన్‌రావు, అనంతపురం నాయకుడు రామ్మోహన్, పత్తికొండ , ఆలూరు, నంద్యాల, నందికొట్కూరు ప్రాంతాల ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

కర్నూలు

లోక్‌సత్తా పార్టీ సభ్యత్వ నమోదు

# నందికొట్కూర్‌లో లోక్‌సత్తా సభ్యత్వ నమోదు

అవినీతి రహిత రాజకీయాలే లక్ష్యంగా పనిచేస్తున్న లోక్‌సత్తా పార్టీకి విద్యావంతులు, మేధావులు, విద్యార్థులు, ప్రజలు మద్దతు తెలపాలని ఆ పార్టీ నాయకులు కోరారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని స్థానిక పటేల్ కూడలిలో ఆ పార్టీ నాయకులు ప్రారంభించారు. మొదటి రోజు వంద మంది సభ్యత్వాలు తీసుకున్నట్లు నాయకులు మురళి, భాష తెలిపారు.



# రాజకీయ ప్రక్షాళనకు మద్దతివ్వండి

## సత్తెనపల్లి

రాజకీయాలు కుళ్లిపోయాయని నిట్టూర్చి మౌనం వహిస్తే, భవిష్యత్తు తరాలకు అందరం అన్యాయం చేసిన వారమవుతాం. విలువలు కలిగిన రాజకీయాలే ధ్యేయంగా ఏర్పాటైన లోక్‌సత్తాకు మద్దతిచ్చి వ్యవస్థల ప్రక్షాళన, మంచి పాలనలో భాగస్వాములు కావాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు డివివియస్. వర్మ ప్రజలకు పిలుపునిచ్చారు. విలువలు కలిగిన రాజకీయాలు ప్రస్తుతం దేశానికి అవసరమన్నారు. రాజకీయాలకు దూరంగా ఉండకుండా మంచి రాజకీయాలను ప్రోత్సహించాలని విద్యావంతులను ఆయన కోరారు.

సమావేశంలో లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు జె.ఐరామ్మూర్తి, యువసత్తా బాధ్యుడు శ్రీనాథరెడ్డి, లోక్‌సత్తా ఉద్యమ సంస్థ బాధ్యుడు అబ్బూరి సత్యనారాయణ, నాయకుల పీడీ మస్తాన్‌వలి, ఖాదర్‌మస్తాన్, రహిమాన్, జాను తదితరులు పాల్గొన్నారు.

## లోక్‌సత్తా పార్టీ సభ్యత్వ నమోదు

## పిడుగురాళ్ళ

సమాజంలో నేటి యువతలో మార్పు కోరుకునేందుకు ప్రతిఒక్కరూ లోక్‌సత్తా పార్టీని బలపరచాలని ఆ పార్టీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు డి.వి.వి.యస్. వర్మ తెలిపారు. పట్టణంలోని ఏడుకొట్ల సెంటర్లో జరిగిన లోక్‌సత్తా సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత రాజకీయాల్లో నైతిక విలువలు పడిపోయాయని, సరైన రాజకీయం వస్తేనే సమాజంలో మార్పు వస్తుందని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ లోక్‌సత్తా పార్టీ విధి విధనాలు పట్ల ఆకర్షితులు కావాల్సిన అవసరముందని ఆ పార్టీ నాయకులు ఐ రామమూర్తి తెలిపారు. పలువురికి పార్టీ సభ్యత్వాన్ని అందించడంతోపాటు కొందర్ని పార్టీలోకి జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు లలితకుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ నాయకులు పాల్గొన్నారు.

## వినుకొండ

రాను రాను కేంద్ర ప్రభుత్వం పాలనావ్యవస్థ సంక్షోభంలో పడుతోందని లోక్‌సత్తా రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు, సురాజ్య ఉద్యమం రాష్ట్ర నాయకుడు వర్మ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సురాజ్య ఉద్యమం సమావేశం జరిగింది. పాల్గొన్న వర్మ మాట్లాడుతూ, ప్రజల మానప్రాణాలను రక్షించడంలో ప్రభుత్వం దారుణంగా వైఫల్యం చెందిందన్నారు. ఢిల్లీలో గ్యాంగ్‌రేప్ సంఘటనే పాలనావ్యవస్థ సంక్షోభానికి అద్దం పడుతోందన్నారు. ప్రజల హక్కుల సాధన కోసం ఉద్యమిస్తామన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించే, న్యాయం, నేర పరిశోధన తక్షణం జరిపించే వ్యవస్థ కావాలన్నారు. తలసరి గ్రాంటు ఇవ్వక, స్థానిక పాలన లేకపోతే సంక్షోభం తప్పదన్నారు. అందరికీ సమాన విద్య, వైద్యం కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తామన్నారు. సురాజ్య ఉద్యమ కమిటీలను పూర్తిస్థాయిలో విస్తృతపరచి కమిటీలో అందరినీ భాగస్వాములను చేయాలని ఆయన సూచించారు. సురాజ్య ఉద్యమ వలంటీర్సును నియమించి వారికి శిక్షణనిస్తామన్నారు.

లోక్‌సత్తా రాష్ట్ర ఉపాధ్యక్షుడు జజ్జూరి ఐరామ్మూర్తి మాట్లాడుతూ, రాజకీయాలకు అతీతంగా సమస్యల పరిష్కారానికి ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో సురాజ్య ఉద్యమ కమిటీ సభ్యుడు ఎంఎన్‌ప్రసాద్, పీజే లూకా, తుపాకుల కొండలరెడ్డి, లగడపాటి శ్రీను, సత్తార్, నబి, రామాచారి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## తెనాలి

జనవరి 2వ తేదీన తెనాలిలో లోక్‌సత్తా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని డి.వి.వి.యస్. వర్మ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా అధ్యక్షులు జె.ఐరామూర్తి, సముద్రాల నరేంద్ర, పార్ధసారధి, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సుపరిపాలన అందించే వ్యవస్థ కావాలి : జేపీ

**మియాపూర్ లోక్‌సత్తా పార్టీ సభ్యత్వ నమోదు**

మంచి పాలన అందించే కొత్త వ్యవస్థను రూపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకులు జయప్రకాష్ నారాయణ్ అన్నారు. మియాపూర్ మదీనాగూడలోని ఆ పార్టీ కార్యాలయంలో వివిధ ప్రాంతాలకు చెందిన వారు ఆయన సమక్షంలో లోక్‌సత్తా పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జయప్రకాష్ నారాయణ్ మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవి మొదలుకుని జిల్లా, నియోజకవర్గ స్థాయిలో నూతన కేడర్‌ను ఎన్నుకుంటారని ఆయన తెలిపారు. ఈ జనవరి నెలను పార్టీ సభ్యత్వ నమోదు నెలగా ప్రకటిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. లోక్‌సత్తా పార్టీ ప్రధాన కార్యదర్శి కటారి శ్రీనివాస్, శేరిలింగం పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి జి. సేరేందర్, రామరాజు, హనుమంతరావు, వెలగ శ్రీనివాస్, టివి రాణి, శ్రీనివాస్, సందేశ్‌రెడ్డి, కష్యప్, నాగరాజు, రవి పాల్గొన్నారు.

**విజేత కాలేజీ ఆవిర్భావ సభ**

కొందరు కులం, మతం, భాష ప్రాంతాల పేరుతో ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతున్నారని, విద్యార్థులు అటువంటి వాటికి దూరంగా ఉండాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే జయప్రకాష్ నారాయణ్ అన్నారు. మియాపూర్ నరేన్ గార్డెన్స్‌లో విజేత కాలేజీ ఆవిర్భావ సభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. విద్యారంగంలో విద్యార్థులు భట్టీ విధానాన్ని అవలంభిస్తున్నారని, కానీ మార్కులు సాధించినంత మాత్రాన నేర్చుకున్నట్లు కాదన్నారు. నిజమైన చదువులు జ్ఞానాన్ని ఇవ్వాలన్నారు. పీసా అనే సంస్థ 15 ఏళ్ళ విద్యార్థులపై ఏమి నేర్చుకుంటున్నారనే విషయంపై 74 దేశాల్లో సర్వే నిర్వహిస్తే అందులో భారతదేశం 73వ స్థానంలో ఉందని తెలిపారు. కార్యక్రమంలో విజేత డిగ్రీ కళాశాల ఛైర్మన్ రామకృష్ణారాజులు, డైరెక్టర్ సుధీర్‌వర్మ, ప్రిన్సిపల్ అమర్‌నాథ్ చావ్లా, చాటర్డ్ అకౌంటెంట్ చందన్‌కుమార్, రవీందర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

# యూసుఫ్‌గూడలో లోక్‌సత్తా సభ్యత్వ నమోదు

యూసుఫ్‌గూడ చెక్‌పోస్టు వద్ద జూబ్లీహిల్స్ నియోజకవర్గ లోక్‌సత్తా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జి సాంబిరెడ్డి మాట్లాడుతూ అవినీతి రహిత పాలన కోసం, ఓటు బ్యాంకు రాజకీయాలు పోవాలంటే ఈ చెత్త రాజకీయాలను చెత్తలో వేయాల్సిందేనని అభిప్రాయపడ్డారు. డివిజన్ ఇన్‌చార్జి హసన్, చిరంజీవి, రత్నాకర్, రాజారావు, భవానీ, జనార్ధన్ పాల్గొన్నారు.




**వెంగళరావునగర్ :**

వారసత్వ రాజకీయాలను దరిచేరనీయకుండా ప్రజాస్వామ్య రాజకీయాలను బలోపేతం చేసేందుకు యువత లోక్‌సత్తా పార్టీలో చేరాలని ఆ పార్టీ వర్కింగ్ కమిటీ సభ్యుడు నాగేందర్‌బాబు అన్నారు. కేంద్ర, రాష్ట్ర రాజకీయాలలో ప్రభావితం చేసే నిర్ణయాలలో భాగస్వాములుగా అయ్యేందుకు నేటి యువతరం లోక్‌సత్తా పార్టీలో చేరాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా యువకులు సభ్యత్వాన్ని పొందారు. కార్యక్రమంలో సభ్యత్వ నమోదు ఇన్‌ఛార్జి సాంబిరెడ్డి, పార్టీ ప్రతినిధుల భవానీ, యు.వి.రాజు, దినేష్ వికాస్, హరీష్, నాగరాజు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# ప్రజల పక్షాన పోరాడుతున్న లోక్‌సత్తా పార్టీ



**విజయనగరం**

ప్రజల పక్షాన పనిచేసే పార్టీగా రాష్ట్రంలో లోక్‌సత్తా ఒక గొప్ప స్థానాన్ని సంపాదించుకుందని పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు చింతలపూడి అప్పలరాజు పేర్కొన్నారు. జనవరి 3వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న నెలరోజుల పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియ కార్యక్రమంలో భాగంగా విజయనగరం కోట కూడలిలో పార్టీ జిల్లాశాఖ నమోదు ప్రారంభించింది. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ అవినీతికి వ్యతిరేకంగా పోరాడుతున్న లోక్‌సత్తా పార్టీకి ప్రజలు తమ పూర్తి సహాయ సహకారాలు అందించారన్నారు. పార్టీ యువసత్తా అధ్యక్ష, కార్యదర్శులు రమణ, దయానంద్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను ఎత్తి చూపుతున్న లోక్‌సత్తా పార్టీకి రానున్న రోజుల్లో మంచి ఆదరణ లభిస్తోందన్నారు. ప్రతి సమస్యను ఎత్తిచూపి ప్రజల పక్షాన ప్రభుత్వంతో పోరాడి వారికి న్యాయం చేయడంలో పూర్తిగా పార్టీ విజయవంతమైందన్నారు. ఈ ప్రక్రియలో పార్టీ నాయకులు ఆర్. సుధాకర్, ఎం. సుభద్రాదేవి, ఎ.కాశీపతి, జి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. పెద్దసంఖ్యలో యువత సభ్యత్వంలో తమ పేర్లు నమోదు చేసుకున్నారు.

# జిల్లా ఆసుపత్రి శవాలగదికి రూ.5 లక్షలు మంజూరు



**విజయనగరం**

అనేక ఏళ్ళుగా జిల్లా కేంద్రాసుపత్రి తీరని సమస్యగా వున్న శవాలగది మార్పు సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. లోక్‌సత్తా పార్టీ నేతలు భీశెట్టి బాబ్జీ సారధ్యంలో ఈ సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్ళి అక్కడి పరిస్థితిని గ్రీవెన్సులో వివరించారు. దీనికి స్పందించిన కలెక్టర్ ఎం. వీరబ్రహ్మయ్య వెంటనే సాధారణ నిధులనుంచి రూ.5 లక్షలను మంజూరు చేస్తున్నట్లు ఆదేశాలు జారి చేశారు. దీనిపై లోక్‌సత్తా పార్టీ నేతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇన్నాళ్లుగా ఏ నేతలు పట్టించుకోని దీర్ఘకాల సమస్యను లోక్‌సత్తా పార్టీ పట్టించుకుని దానిని సాధించడం వల్ల ప్రజలు ఆ పార్టీ నేతలను అభినందిస్తున్నారు. ఇప్పటికే అనేక ప్రజా సమస్యలపై పోరాటం చేసి సాధించిన విజయాలలో ఈ విజయంను కూడా లోక్‌సత్తా తన ఖాతాలో వేసుకుంది.

# లోక్‌సత్తా సభ్యత్వ నమోదు ప్రారంభం

## నంద్యాల

రాష్ట్రవ్యాప్తంగా లోక్‌సత్తా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా స్థానిక టీటీడీ కల్యాణమండపం రోడ్డులో ఏర్పాటు చేసిన స్టాల్‌ను పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు డి.వి.వి.యస్. వర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వార్థపూరిత రాజకీయాలను అవినీతి రాజకీయాలను చూసి ప్రజలు విసిగిపోతున్నారన్నారు. ప్రజలు ప్రత్యామ్నాయం కోసం ఎదురు చూస్తున్నారని, ప్రజల మనోభావాలకు తగినట్లు అవినీతి రహిత రాజకీయాలను నడిపే లోక్‌సత్తా పార్టీ పట్ల ఆసక్తి చూపుతున్నారని చెప్పారు. పార్టీ నంద్యాల ఇన్‌చార్జి మజీజ్ మాట్లాడుతూ యువకులు లోక్‌సత్తాలో చేరి రాష్ట్ర రాజకీయాలను ప్రక్షాళన చేయడానికి తోడ్పడాలన్నారు. 80 మంది యువకులు ఒక్కొక్కరు రూ.100 చెల్లించి పార్టీ మూడేళ్ల సభ్యత్వాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగన్నాథరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఓంకార్, నంద్యాల ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు వెంగళరెడ్డి, గౌరవాధ్యక్షుడు డా॥ శౌరిరెడ్డి పాల్గొన్నారు.

# అత్యాచారాలకు నిరసనగా చర్లలో ర్యాలీ



దేశంలో అనేక ప్రాంతాల్లో అమానవీయంగా జరుగుతున్న అత్యాచారాలకు నిరసనగా లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో ఖమ్మంజిల్లా చర్లలో ర్యాలీ నిర్వహించారు. చర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల, గౌతమీ డిగ్రీ కళాశాల, భద్రాద్రి డిగ్రీ కళాశాల విద్యార్థులు, లెక్చరర్లు, ఈ ర్యాలీలో పాల్గొన్నారు. జూనియర్ కళాశాల నుండి ర్యాలీ బస్టాండ్ మీదుగా అంబేద్కర్ సెంటర్ నుండి తహశీల్దార్ కార్యాలయానికి చేరుకొంది. అక్కడ భద్రాచలం సబ్ కలెక్టర్ నారాయణ భరత్ గుప్తాను కలిసి విద్యార్థులు వినతిపత్రం అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల పట్ల అమర్యాదకరంగా, అసభ్యకరంగా ప్రవర్తించేవారికి కఠిన శిక్షలు పడడం న్యాయమేనని అన్నారు. విద్యార్థుల వినతిపత్రంలోని అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ మండల ఇన్‌ఛార్జీ వెంగళ వెంకటరమణ, అధ్యక్షులు చింతూరి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు చెనుమళ్ల నాగేశ్వరరావు, తదితరుల పాల్గొన్నారు.

# గుంతకల్లులో కొవ్వొత్తుల ప్రదర్శన

ఢిల్లీలో సామూహిక అత్యాచారానికి గురై మృతిచెందిన మహిళకు సంతాపంగా పట్టణ లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో విద్యార్థులు కొవ్వొత్తుల ప్రదర్శనను నిర్వహించారు. నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థులు, లోక్‌సత్తా పార్టీ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ నాయకులు రామ్మోహన్ మాట్లాడుతూ యువతిపై అత్యాచారానికి పాల్పడి మృతికి కారకులైన వారి విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని తీవ్రమైన శిక్షలను విధించటానికి వీలుగా చట్టాల్లో మార్పులు తేవాలని కోరారు. మృతురాలి కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రిన్సిపల్ రామమోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వారసత్వ రాజకీయాలను పారదోలండి




## గుంతకల్లు

వారసత్వ రాజకీయాలను పారదోలి సామాన్యుడు సైతం పార్టీ అధ్యక్షులుగా ఎన్నికయ్యే పరిస్థితులున్న లోక్‌సత్తా పార్టీలో చేరాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యదర్శి బండారు రామ్మోహన్‌రావు పేర్కొన్నారు.

గుంతకల్లులో సాగుతున్న పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలంటే జెండాలు మోసే కూలీలు కారని పార్టీ మూల స్తంభాలుగా వారిని గుర్తించినప్పుడే పార్టీలు ప్రజల కోసం పనిచేసే వీలు కలుగుతుందన్నారు. సామాన్య కార్యకర్తలను కూడా పెద్దపీట వేసి వారిని నాయకులుగా ఎదగడానికి జన రాజకీయాలు చేసే లోక్‌సత్తా పార్టీలో యువత, మహిళలు, విద్యార్థులు, వ్యవసాయ కూలీలు, రైతులు కూడా అధిక సంఖ్యలో చేరుతున్నారని ఆయన చెప్పారు. రాష్ట్ర కార్యదర్శి కే.ఓంకార్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జనవరి 2న ప్రారంభమైన లోక్‌సత్తా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఈ నెల 31 వరకు కొనసాగుతుందన్నారు. నాయకులు బి.బాబు, మహమ్మద్‌గౌస్, రామ్మోహన్, నాగభూషణం, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

---

# సుపరిపాలన కోసం సురాజ్య ఉద్యమం

## లోక్‌సత్తా పార్టీ సభ్యత్వ నమోదు

## ఆదోని

ఒక్కరైతే ఒంటరి... ఒక్కటైతే ఉప్పెన. ఆ ఉప్పెన ఉద్యమం జ్వాల రగిలిస్తే సుపరిపాలన తథ్యమని విభాగం సంధానకర్త (కన్వీనర్) యగ్గటి మహదేవప్ప తెలిపారు. స్థానిక ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల రహదారిలోని మోర్ దిగువనున్న వేడుకల భవనంలో సురాజ్య ఉద్యమ సదస్సు జరిగింది. పార్టీలకు అతీతంగా ప్రముఖులు, మాజీ ప్రజాప్రతినిధులు హాజరై విలువైన సందేశం ఇచ్చారు. మహదేవప్ప మాట్లాడుతూ సురాజ్యం మన కోసం, మనందరి కోసం సాగించే ఉద్యమం. ప్రతిఒక్కరు మమేకం కావాలని కోరారు. పురపాలక సంఘం పరిధిలో నెలకొన్ని చిన్న చిన్న సమస్యలను మనమే సంఘటితమై వాటిని పరిష్కరించుకుందామని పిలుపునిచ్చారు. ఆదోని వ్యవసాయ విపణి పాలన కమిటీ అధ్యక్షులు దేవిశెట్టి ప్రకాష్, న్యాయవాదులు గోవర్ధన్ దేశాయి, నాగేంద్రయ్య, సమాచార హక్కు ప్రచార ఐక్యవేదిక సంధానకర్త దేశాయి చంద్రన్న, పురపాలక సంఘం మాజీ అధ్యక్షులు మల్లయ్య, ప్రముఖులు చంద్రకాంత్ రెడ్డి, ప్రసాద్‌రావు, ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాల విశ్రాంత ప్రధానాచార్యులు వెంకటరెడ్డి, సంజయ్, శాంతిప్రసాద్, గోవిందరాజు మాట్లాడారు. సురాజ్య ఉద్యమం చేపట్టాల్సిన పనులను సూచించారు. చక్కటి సలహాలు ఇచ్చారు. మేము సైతం ఉద్యమ స్ఫూర్తితో ముందుకు కదులుతామని తెలిపారు.

# అనకాపల్లిలో పార్టీ ప్రచారానికి 'ఉదయం నడక'



మున్సిపల్ వార్డులలో, గ్రామాలలో ప్రజాసమస్యల్ని తెలుసుకోడానికి వాటిని మున్సిపల్ అధికారులతో, మండలాధికార్లతో చర్చించి పరిష్కరించడానికి అనకాపల్లి లోక్‌సత్తా పార్టీ "ఉదయంనడక' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నది. దీనిలో భాగంగా సాంఘికసంక్షేమ హాస్టళ్ల, అంగన్‌వాడీ సెంటర్ల సందర్శనతోపాటు పార్టీ సభ్యత్వ నమోదును సాగిస్తున్నారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా నాయకులు పి. రామచంద్రరావు, వేలం నూకరాజు, భాస్కర్, రవి, చక్రధర్, స్వరూప్, గోపీ, పి.నర్శింగరావులు పాల్గొంటున్నారు.

# అవినీతిని నిర్మూలించాలి

**ఏలూరు**

**లోక్‌సత్తా పార్టీ సభ్యత్వ నమోదు**

2012వ సంవత్సరం పాలనా వ్యవస్థను సంక్షోభంలోకి నెట్టిన సంవత్సరంగా లోక్‌సత్తా వర్కింగ్ ప్రెసిడెంట్ డి.వి.వి.యస్. వర్మ అభివర్ణించారు. స్థానిక ఆర్.ఆర్. పేటలో ఓ ప్రైవేటు భవనంలో లోక్‌సత్తా కార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన వర్మ మాట్లాడుతూ కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల ధన, మాన, ప్రాణ, రక్షణలో పూర్తిగా వైఫల్యం చెందిందని ఢిల్లీ అత్యాచార ఘటన రుజువు చేసిందన్నారు. గత ఏడాది పాలనలో దేశం అవినీతిలో కూరుకుపోయిందని, మన రాష్ట్రం అవినీతిలో దేశంలోనే అగ్రస్థానంలో ఉందన్నారు. అవినీతిని తక్షణం నిర్మూలించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. రాష్ట్రాభివృద్ధికి కీలకమైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రాయితీలు, సబ్సిడీలు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టి ఓటు బ్యాంకు రాజకీయాలను అన్ని రాజకీయ పార్టీలు చేస్తున్నాయన్నారు. డబ్బు, కులం పేదరికంతో నిమిత్తం లేకుండా ఉచితంగా మంచి ప్రమాణాలతో విద్యా, వైద్య సేవలు అందించేందుకు లోక్‌సత్తా పార్టీ కృషి చేస్తోందన్నారు. లోక్‌సత్తా పార్టీ కుటుంబ పార్టీ, ప్రైవేటు ఎస్టేట్, వారసుల ఆస్తి కాదన్నారు. రాజకీయాల ప్రక్షాళన యువతకే సాధ్యపడుతుందన్నారు. ఓట్లు, నోట్లు, అవినీతి ఫార్ములాకు లోక్‌సత్తా పార్టీ దూరంగా ఉంటుందన్నారు. విలువలు పెంచే రాజకీయం కోసం లోక్‌సత్తా పార్టీలో సభ్యులుగా చేరాలని పిలుపునిచ్చారు. సభ్యత్వం నమోదు కార్యక్రమం ఈ నెల 2 నుంచి ఉద్యమంగా చేపట్టామన్నారు.

జనవరి 30వ తేదీలోగా సభ్యత్వం తీసుకున్న వారికి సంస్థాగత ఎన్నికల్లో ఓటు హక్కు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు జి. జానకిరామ్, పట్టణ కో ఆర్డినేటర్ కామినేని సాంబశివరావు, ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి చిక్కా భీమేశ్వర రావు, జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# వారసత్వం లేకుంటే సురాజ్యమే



## వనపర్తి

పార్టీల్లో వారసత్వ రాజకీయాలు లేనప్పుడే కేంద్రంలో, రాష్ట్రంలోనూ సురాజ్యం, సుపరిపాలన సాధ్యమవుతాయని లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు, కూకట్‌పల్లి శాసనసభ్యుడు జయప్రకాష్ నారాయణ్ అన్నారు. వనపర్తిలో సురాజ్య ఉద్యమ కార్యక్రమంలో భాగంగా వివేకానంద ఆడిటోరియంలో వివిధ కళాశాలల విద్యార్థులతో ఏర్పాటు చేసిన ముఖాముఖిలో ఆయన మాట్లాడారు. 'తొలితరం రాజకీయాల్లో కనిపించిన నీతి, నిజాయితీ ఈ తరంలో కనిపించడం లేదు. ఎన్నికల్లో రూ.కోట్లు ఖర్చు పెట్టి మళ్లీ కోట్లు సంపాదించడమే రాజకీయ లక్ష్యం అయిపోయింది' అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాన పార్టీల్లో పైన చెప్పిన నేతలు కాకుండా పదవుల పోటీలో నేనున్నానంటూ ఎవరూ ధైర్యం చేయలేని స్థితిలో నాయకులు ఉన్నారన్నారు. ఫిబ్రవరిలో లోక్‌సత్తా పార్టీ అధ్యక్ష పదవికి జరిగే ఎన్నికల్లో తాను దూరంగా ఉంటానని, కార్యకర్తలు అధ్యక్షునికిగా ఎవరినైనా ఎన్నుకోవచ్చని స్పష్టం చేశారు.

■ అంతకు ముందు దివంగత ఐఏఎస్ అధికారి ఎస్ఆర్ శంకరన్ విగ్రహానికి జయప్రకాష్ నారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. శంకరన్ మృతికి ముందు సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందలేదని, ఇప్పుడు ఆయన బతికుంటే పేద, బడుగు, బలహీనవర్గాలు అభ్యున్నతి కోసం కన్న కలలు సాకారమయ్యేవన్నారు. కార్యక్రమంలో పార్టీ ప్రతినిధులు కటారి శ్రీనివాసరావు, బండారు రామ్మోహన్‌రావు, భాస్కర్, భూపేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వనపర్తి సభ్యత్వ నమోదులో జేపీ



ఇతర రాష్ట్రాల్లో విక్రయించేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు అవస్థలు పడుతున్న సమయంలో తాను పాదయాత్ర చేసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నానని అన్నారు. 36 కిలోమీటర్ల పాదయాత్ర నిర్వహించి రైతులకు ఒక్క సీజన్‌లోనే రూ.3600 కోట్ల ఆదాయం వచ్చేలా చేశానని చెప్పారు. ఒక కిలోమీటరు పాదయాత్రకి వంద కోట్ల చొప్పున రైతులకు లాభం జరిగిందన్నారు. కర్నూలు నుంచి కర్ణాటకకు రైతులు పండించిన ధాన్యాన్ని తీసుకెళ్లి విక్రయించామని, దీంతో ప్రభుత్వం ధాన్యం విక్రయాలకు రైతులకు పర్మిట్లు ఇచ్చిందని ఆయన వివరించారు. కుటుంబసభ్యుల కోసం రాజకీయాలు చేసే వారిని వదిలి ప్రజల కోసం పనిచేసే వారిని చట్టసభలకు పంపాలని ఆయన యువతను కోరారు. లోక్‌సత్తా పార్టీలో యువతకు అవకాశం ఇస్తామన్నారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర నాయకులు కటారి శ్రీనివాసరావు, బండారు రామ్మోహన్‌రావు , డాక్టర్ బాలకిష్టయ్య మెమోరియల్ ట్రస్ట్ ఛైర్మన్ డాక్టర్ భూపేష్ కుమార్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# లోక్‌సత్తా ఆధ్వర్యంలో రైతు చైతన్య యాత్రలు



మండలంలోని డి.కొండాపురం, గ్రామదట్ల, టి.వీరాపురం గ్రామాల్లో రాయదుర్గం నియోజకవర్గం లోక్‌సత్తా పార్టీ ఇన్‌ఛార్జి బాబు ఆధ్వర్యంలో రైతు చైతన్యయాత్రలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన రైతులనుద్దేశించి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను, వ్యవసాయ రంగాలను నిర్వీర్యం చేయకుండా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. రాయదుర్గం నియోజకవర్గంలో వరి పండిస్తున్న రైతులు తమ ఉత్పత్తులను దేశంలో ఎక్కడికైనా తీసుకొని వెళ్ళి అమ్ముకోవడానికి అనుమతులు ఇవ్వాలన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు కలిగే విధంగా ప్రభుత్వాలు చొరవ చూపాలన్నారు. రాయదుర్గం, గుమ్మఘట్ట, కణేకల్లు, డి. హిరేహాళ్, బొమ్మనహాళ్ మండల కేంద్రాల్లో ప్రభుత్వం వరి కొనుగోళ్ల కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు.

**రాయదుర్గం**

---

### వ్యవసాయానికి 7 గంటలు విద్యుత్ ఇవ్వకుంటే

# ఆందోళనలు ఉధృతం





ప్రభుత్వం వ్యవసాయానికి 7 గంటలపాటు నిరంతర విద్యుత్ సౌకర్యం కల్పించాలని అఖిలపక్షం నాయకులు, రాయదుర్గం లోక్‌సత్తా పార్టీ ఇన్‌చార్జ్ బి,వెంకటరమణబాబు, తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి గుణపాటి దీపక్‌రెడ్డి, సిపిఐ నాయకులు నాగార్జున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయం ఎదుట మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యుత్ సౌకర్యం వ్యవసాయానికి సక్రమంగా కల్పించకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారిన ఎన్నకలపుడు వ్యవసాయానికి 7 గంటలపాటు నిరంతరం విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని రైతులకు హామీనిచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్ల రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తపరిచారు. ఉపాధి హామీ పథకాన్ని రైతాంగానికి అనుసందానం చేయాలన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ముఖ్యంగా తాగునీటి సమస్యలపై శ్రద్ధ వహించి సమస్యలు తలెత్తకోకుండా తగిన ఏర్పాట్లను చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, పొరాళు శ్రీనివాసులు, పసుపులేటి రాజు, లోక్‌సత్తా పార్టీ నాయకులు ఎస్.కె. అబ్దుల్లా, రియాజ్, సిపిఐ జిల్లా కార్యదర్శి జగదీష్, వెంకటేశులు, తాయప్ప, సత్యప్పలతో పాటు దాదాపు 500 మంది రైతులు పాల్గొన్నారు.

**రాయదుర్గం**

# కొత్త తరహా రాజకీయానికి మద్దత్తునివ్వండి

## రాయదుర్గం




వారసత్వ రాజకీయాలను తిరస్కరించి ప్రజా రాజకీయాలను ప్రజలు ఆదరించాలని లోక్‌సత్తా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారు రామ్మోహన్‌రావు పేర్కొన్నారు. పట్టణంలోని పాత మునిసిపల్ కార్యాలయం ఎదురుగా స్థానిక పార్టీ ఇన్‌చార్జ్ బీ.బాబు అధ్యక్షతన సభ్యత్వ నమోదును ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సాంప్రదాయ రాజకీయ పార్టీలు వ్యక్తి, కుటుంబ, వారసత్వ పార్టీలుగా నడుస్తున్నాయని, కార్యకర్తలు మాత్రం పార్టీల జెండాలు మోసే వారిగానే మిగిలిపోతున్నారని విమర్శించారు. 'సారా' పార్టీలలో వారసత్వంగా నాయకత్వం వస్తుందని, తమ పార్టీలో కుటుంబ వారసత్వానికి తావు లేదన్నారు. అందుకే డా॥ జయప్రకాష్ నారాయణ్ పార్టీకి వ్యవస్థాపకుడైనా ఈసారి రాష్ట్ర అధ్యక్ష పదవికి పోటీ నుంచి స్వచ్ఛందంగా తప్పుకొని నాయకత్వానికి తావిచ్చానని తెలిపారు. సామాన్య పార్టీ కార్యకర్తలు కూడా రాష్ట్ర అధ్యక్ష పదవికి పోటీ పడేలా సంస్థాగత ఎన్నికల నియమావళిని రూపొందించుకున్నారు. పార్టీ సభ్యులే పార్టీకి నాయకత్వం ఇవ్వడంతోపాటు పార్టీకి నిధులు సమకూర్చుకునేలా పార్టీ సభ్యత్వ రుసుం నిర్ణయించామని ఆయన తెలిపారు. మార్చి నెలాఖరుకు రాష్ట్ర పార్టీ ఎన్నికలు పూర్తి చేసుకుంటామన్నారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రూ.10, క్రియాశీల సభ్యులు రూ.100, ఎగ్జిక్యూటివ్ సభ్యులు వెయ్యి రూపాయలు, జీవిత సభ్యులు రూ.10 వేలు చెల్లించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్లా, హనుమంతు, వేన్నూరు స్వామి, నాగరాజు, ఆదిశేషయ్య, రామప్పలు పాల్గొన్నారు.

## తాడేపల్లిగూడెంలో సభ్యత్వ నమోదు

తాడేపల్లిగూడెంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించాలని ప్రతి పార్టీ సభ్యుడు ఈ నమోదు ఉద్యమంలో భాగస్వామి కావాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు డి.వి.వి.యస్. వర్మ అన్నారు. స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంచి రాజకీయ వ్యవస్థల కోసం అవినీతి రహిత పాలన కోసం లోక్‌సత్తా పార్టీలో చేరాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు జి. జానకిరామరాజు, పట్టణ అధ్యక్షులు కె.కె. విశ్వేశ్వర్ రావు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి సాగిరాజు జానకిరామరాజు తదితరులు పాల్గొన్నారు. పట్టణంలో సభ్యత్వ కార్యక్రమాన్ని కొనసాగించటానికి రోజువారీ కార్యక్రమాలను రూపొందించుకున్నారు.

## తణుకులో సురాజ్య సమావేశం

జనవరి 12వ తేదీన తణుకులో సురాజ్య కమిటీ సమావేశం జరిగింది. సురాజ్య ఉద్యమ మలిదశ కార్యక్రమంగా ప్రజా మున్సిపల్ కౌన్సిల్ పేరుతో మన ఊళ్లో సురాజ్య ఉద్యమాన్ని కొనసాగించాలని సురాజ్య ఉద్యమ స్టీరింగ్ కమిటీ సభ్యులు డి.వి.వి.యస్. వర్మ విజ్ఞప్తి చేశారు. పట్టణంలో పారిశుధ్య సమస్యపై తొలిప్రజాకౌన్సిల్ నిర్వహించాలని పారిశుధ్య సమస్యలపై జనవరి 30లోగా ఒక నివేదికను రూపొందించాలని ఆకుల వెంకటేశ్వరరావు (మాజీ మున్సిపల్ ఛైర్మన్), కౌన్సిలర్లు మారుతీరావు, నాగరాజు, విశ్రాంత ఉద్యోగులు కేశేశ్వరరావు, ఎ.ఎన్.ఎస్. సత్యనారాయణ, చైతన్యలతో కమిటీని నియమించారు. ఈ కార్యక్రమంలో చిట్టూరి సుబ్బారావు, నందగం సుధాకర్, బి. రమేష్ చంద్రబాబు, కస్తూరి, కిరణ్మయి, భీమారావులు పాల్గొన్నారు.

# మనం మారి.. ఎదుటి వారిని మారమందాం..





## టంగుటూరు

ప్రపంచం మారాలని, మారమని చెప్పేకంటే ముందు ప్రతి ఒక్కరూ ఎవరికి వారు మారితే... వారిని చూసి ఎదుటివారూ మారుతారని లోక్‌సత్తా అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ విద్యార్థులకు ఉద్బోధించారు. టంగుటూరు మండలంలోని రైజ్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు తృతీయసంవత్సరం, సి.ఎస్.ఇ. విద్యార్థులు పవన్, శివ, చిరంజీవి, నాలుగో సంవత్సరం, ఇఇఇ విద్యార్థి ఆంజనేయులు, ద్వితీయ సంవత్సరం, ఎంబీఏ విద్యార్థి సురేష్ కలిసి రూపొందించిన 'రిసెర్చి జర్నీ' వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు డిగ్రీలు, ధృవపత్రాల కోసం కాకుండా, విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు చదవాలని, అప్పుడే సమాజానికి మంచి చేస్తారని అన్నారు. ప్రస్తుతం మనదేశంలో వంద మంది విద్యార్థులకు 80 మంది వరకూ నిరర్థక చదువులనే చదువుతున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. ఉత్తమ విద్యపై ఓ సంస్థ 74 దేశాల్లో సర్వే చేస్తే భారతదేశానికి 73 స్థానం లభించిందని, దీనిని బట్టే మన దేశంలో విద్యా విధానం తీరుతెన్ను అర్థమవుతుందన్నారు. ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు జ్ఞానాన్ని సముపార్జించి, సమస్యల పరిష్కారానికి ఉపయోగించాలని సూచించారు. 'రైజ్ కళాశాల ఛైర్మన్ ఇస్కాల చిన్నరంగమన్నార్ వెబ్‌సైట్ రూపకల్పన బృందం సభ్యుడు ప్రవీణ్ మాట్లాడారు. అనంతరం కళాశాల ఇ.సి.ఇ. విద్యార్థిని తేజశ్వి దేశంలో జరుగుతున్న అకృత్యాలను వివరిస్తూ గీసిన చిత్రపటాన్ని లోక్‌సత్తా అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ్‌కు బహుకరించారు. కార్యక్రమంలో రైజ్ కళాశాల కోశాధికారి తుమ్మపూడి వెంకట సుబ్బయ్య, రైజ్ గాంధీ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ కె.వి. సుబ్బారావు, లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు అల్లూరి శివరమేష్ రెడ్డి, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు

## పెదపూడి



తూర్పుగోదావరి జిల్లా పెదపూడిలో జరిగిన మన ఊళ్ళో సురాజ్యం సన్నాహక రౌండ్‌టేబుల్ సమావేశంలో స్థానిక పెద్దలు చిరంజీవి విజయ నిర్భయను ఉదహరిస్తూ ప్రసంగించారు. అనంతరం వివిధ పాఠశాలల విద్యార్థులకు జరిగిన వక్తృత్వ, వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.

# లోక్‌సత్తా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం




## పత్తికొండ

పట్టణంలోని నాలుగు స్థంబాల దగ్గర రాష్ట్ర లోక్‌సత్తా పార్టీ నాయకులు బండారు రామ్మోహన్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొని సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అవినీతిని వెలికితీసి రైతులకు, ప్రజలకు న్యాయం జరిగేటట్లు కార్యకర్తలకు తెలిసేవిధంగా చెప్పారు. అవినీతిని అంతం చేయడానికి వీరందరు కలిసి అవినీతిని అం అన్నారు. ఈ కార్యక్రమంలో కర్నూలు జిల్లా నాయకులు ఓంకార్, పత్తికొండ నియోజకవర్గ ఇంచార్జీ కె. అనందాచారీ, ఎస్, ప్రసాద్, ఖాకీ శ్రీనివాసులు, రహమాన్, రమణాచారీ, రంగస్వామి పత్రాల నాగేంద్ర, ఎర్రిస్వామి లక్ష్మన్నస్వామి, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

# నవ సమాజ నిర్మాణం యువతకే సాధ్యం: గంగవరపు




## నరసరావుపేట

అవినీతి, మద్యపాన దురాచారం, మహిళలపై అత్యాచారాలు, లంచగొండితనం, జటిల సమస్యలను పరిష్కరించి నూతన సమాజాన్ని నిర్మించగల శక్తి యువతకే వుందని లోక్‌సత్తా నాయకుడు గంగవరపు వెంకటేశ్వర్లు అన్నారు. పురపాలక సంఘం కార్యాలయ సమీపంలో లోక్‌సత్తా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఈదర గోపిచంద్ మాట్లాడుతూ గత ఐదు రోజులుగా వివిధ కూడళ్లలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేశామన్నారు. ఆర్డీవో కార్యాలయం వద్ద, పల్నాడు బస్టాండులో, శివుడు బొమ్మ సెంటర్‌లో, రామిరెడ్డిపేట పాత సమితి ఆఫీసు సెంటర్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు బొబ్బాల ఆదినారాయణ, ఆళ్ళ సుబ్బారెడ్డి, పూజల హనుమంతరావు అప్పాజీ, శాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్య పాలకుల పాపమే



యువత, మహిళలు, సామాన్యులతో కూడిన కొత్తతరం నాయకులు రాజకీయాల్లోకి వచ్చి రాష్ట్రంలో ప్రస్తుతం కుళ్లిపోయిన రాజకీయ వ్యవస్థను మార్చుకోవాలని లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ పిలుపునిచ్చారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు ఒంగోలు వచ్చిన ఆయన స్థానిక సంతపేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రం ప్రస్తుతం ఎదుర్కొంటోన్న విద్యుత్ సమస్యలకు పాలకులే కారణమని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ చేతగానితనం వల్ల ప్రజలపై ధరాభారం మోపుతున్నాయని విమర్శించారు. సహకార సంఘాల ఎన్నికలకు దొంగ ఓట్లు చేర్చుకునేందుకు కాంగ్రెస్ పార్టీ అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని ఆరోపించారు. దేశంలో మహిళలపై వేధింపులు పెరుగుతున్నాయని, నిందితులకు సరైన శిక్షలు పడకపోవడమే అందుకా కారణమని ఆయన పేర్కొన్నారు. మహిళలపై దాడులకు సంబంధించి 100 కేసులకుగానూ కేవలం 6 కేసుల్లో మాత్రమే బాధితులకు న్యాయం జరుగుతోందని, 94 కేసుల్లో అన్యాయం జరుగుతోందని తెలిపారు. చట్టాల్లో లొసుగులు కారణంగా నిందితులు తప్పించుకుంటున్నారని వివరించారు. ఇలాంటి వ్యవస్థ మారినప్పుడే మహిళలపై దాడులను అరికట్టగలమని చెప్పారు.

## ఒంగోలు

### నగదు బదిలీ సరైన పద్ధతి కాదు...

ఎరువులు పంపిణీకి సంబంధించి సబ్సిడీని నగదు బదిలీ పథకం ద్వారా లబ్ధిదారులకు ఇవ్వడం సరైన పద్ధతి కాదని జయప్రకాష్ నారాయణ పేర్కొన్నారు. దీనివల్ల రైతులు ఇబ్బందిపడే పరిస్థితి ఉందన్నారు. అంతేగాకుండా అక్రమాలు చోటుచేసు కుంటాయని తెలిపారు. వీటిని పరిశీలించకుండా కేవలం ఎన్నికల్లో లబ్ధికోసమే కేంద్రప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేసేందుకు పూనుకుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తూ రాష్ట్ర విభజన సమస్యపై నాటకాలాడుతోందని విమర్శించారు. రాష్ట్రంలో ప్రజల కష్టాలకు కేవలం రాజకీయాలే కారణమని ధ్వజమెత్తారు.

### సభ్యత్వ నమోదు ప్రారంభం....

స్థానిక లాయర్‌పేటలోని సాయిబాబా గుడి వద్ద లోక్‌సత్తా పార్టీ సభ్యత నమోదు కార్యక్రమాన్ని జయప్రకాష్ నారాయణ్ ప్రారంభించారు. ప్రతిఒక్కరూ 100 రూపాయల సభ్యత్వ రుసుం చెల్లించి పార్టీలో చేరాలని ఆయన కోరారు. తమ పార్టీలో మూడు రకాల సభ్యత్వాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. 1000 రూపాయలతో ఎగ్జిక్యూటివ్ సభ్యత్వం పొందిన వారికి పార్టీ తరపున ఎన్నికల్లో పోటీచేసే అవకాశం ఉంటుందన్నారు. యువకులు, సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు మహ్మద్‌రఫీ, నాయకులు కటారి శ్రీనివాసరావు, రత్నకుమారి పాల్గొన్నారు.

# ప్రమాణాలతో కూడిన విద్య అవసరం : జేపీ



## ఒంగోలు

చదువుల పేరుతో మన రాష్ట్రంలో విద్యార్థులను వేధిస్తున్నారని, ర్యాంకులు, మార్కులు ప్రాతిపదికన విద్యను బోధిస్తూ విద్యార్థుల భవిష్యత్‌ను నాశనం చేస్తున్నారని లోక్‌సత్తా జాతీయ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక రైజ్ ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యా, ప్రమాణాలకు సంబంధించి 'పీస్' అనే సంస్థ ప్రపంచవ్యాప్తంగా 74 దేశాల్లో సర్వే చేస్తే మన దేశం 73వ స్థానం నిలిచిందన్నారు. ఇటువంటి చదువులు ఎవరిని ఉద్ధరించడానికని ప్రశ్నించారు. సమాజంలో సరైన గుర్తింపు రావాలన్నా, జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదిగేందుకైనా విద్య ప్రముఖ పాత్ర పోషిస్తుందని, అటువంటి విద్యను విద్యార్థులకందించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని ధ్వజమెత్తారు. పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులకు ప్రమాణాలతో కూడిన విద్యనందించడాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి పరిస్థితి నుంచి సమాజాన్ని మార్చాలంటే విద్యర్థులు సరైన దిశగా ఆలోచన చేయాల్సిన అవసరం ఉందన్నారు. కుల, మత, ప్రాంత, రాజకీయం పేరుతో తిట్టుకోవడమే నేడు రాజకీయంగా మారిందన్నారు. యువత కులం, మతం వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు.

**వెబ్‌సైట్ ప్రారంభం**

రైజ్ కళాశాల విద్యార్థులు ప్రవీణ్, శివ, చిరంజీవి, ఆంజనేయులు, సురేష్ అనే విద్యార్థులు నూతనంగా రూపొందించిన 'రీసెర్చ్ జర్నీ' అనే వెబ్‌సైట్‌ను జయప్రకాష్ నారాయణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జేపీ విద్యార్థుల సృజనాత్మక శక్తిని ఆయన అభినందించారు. అనంతరం కళాశాల యాజమాన్యం జేపీని ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ఇస్కాల చినరంగమన్నార్, సెక్రటరీ కేవీ సుబ్రహ్మణ్యం, ట్రెజరర్ తాటిపూడి వెంకటసుబ్బయ్య, లోక్‌సత్తా పార్టీ నాయకులు కటారి శ్రీనివాసరావు, అల్లు శివరమేష్ రెడ్డి, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

# విశాఖపట్నంలో యువసత్తా భారీ ర్యాలీ




జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని యువసత్తా, స్టూడెంట్ ఫర్ నేషన్ బిల్డింగ్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. బీచ్ రోడ్డులోని ఓఎంసీఏ నుంచి ఆర్కే మిషన్ వరకు సాగిన ఈ ర్యాలీలో నగరానికి చెందిన వివిధ కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. వివేకానంద బోధనలతో కూడిన ప్లకార్డులు ర్యాలీలో ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా నిర్వాహకుడు రవికిరణ్ మాట్లాడుతూ వివేకానందుని బోధనలు ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో యువసత్తా ప్రతినిధులు మిథున్, రేడియో మిర్చి జాకీ మాయగాడు ప్రేమ్, హరీష్, రవి, శశిధర్, అనిల్, పూర్నేష్ పాల్గొన్నారు.

# జ్వరం, వ్యాధి లక్షణం మాత్రమే

- డా॥ వి.వి. రామారావు
ప్రొఫెసర్ ఆఫ్ మెడిసన్
సూపరింటెండెంట్/ప్రిన్సిపాల్ (రిటైర్డ్)

జ్వరమంటే శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది (98-100 డిగ్రీల ఫారెన్‌హీట్) ప్రొద్దుట కంటే సాయంత్రం కొంచెం పెరుగుతుంది. వెచ్చగా యుండుల, ముఖం ఎర్రబడటం, చలి, వణుకు, చెమటపట్టుట మున్నగు అనేక ఇతర లక్షణాలు ఉండవచ్చు. అంతర్గతముగా ప్రవేశించిన ఒక వ్యాధికి జ్వరము ఒక లక్షణం మాత్రమే. అనేక వ్యాధుల లో జ్వరం రావచ్చు. జ్వర తీవ్రత కూడా ఉష్ణోగ్రతలు బట్టి గుర్తించకూడదు. జ్వర తీవ్రతను బట్టి (కొన్ని మినహాయింపులతో) వ్యాధి తీవ్రత ఆధారపడదు. ఎక్కువ ఉష్ణోగ్రత (103 - 104 ఫారెన్‌హీట్) ప్రారంభమైన జ్వరాలు ప్రమాదకరమైనవి కావు. చాలా వరకు కొద్ది రోజులలోనే మందులు అవసరం లేకుండా నయమౌతాయి. తక్కువ ఉష్ణోగ్రత (వైరల్ జ్వరాలు) లో ప్రారంభమైనవి దీర్ఘకాల వ్యాధులు గాని, కేన్సరు లాంటి వ్యాధులు గాని అయి వుండవచ్చు.

**జ్వరాలలో వివిధ రకాలు :**

1) రోజంతా నిరంతరంగా వచ్చే జ్వరాలు 1 డిగ్రీ కంటే మార్పు రాకపోవచ్చు. న్యూమెనియా, టైఫాయిడ్, మూత్ర నాళాలలో క్రిమి ప్రవేశం, బ్రాసిలోసిస్ టైఫస్ మున్నగునవి.

2) రోజులోగాని, రోజులకు గాని మార్పు (పున: పున: వచ్చే) జ్వరాలు : మలేరియా, ఫైలేరియా, సెప్టిసమియా

మలేరియాలో :

Quotidian : రోజూ వచ్చి పోయేది 24 గం॥లు
తీవ్రమైన రకం (పి.7)

Tertion : 48 గం॥లకొకసారి

Quartan : 72 గం॥ల కొకసారి

రోగి కాని సాధారణ ప్రజలు గాని వరుసగా రోజుకు 1,2 సార్లు వ్యాధి తగ్గిందని అనుకోవటం సరికాదు. కనీసం 72 గం॥లపాటు ఉష్ణోగ్రత పెరగకుండా వున్నప్పుడే చాలా వ్యాధులు (కొన్ని మినహాయింపులతో) నయమైనట్లు భావించాలి.

వారానికొకసారి వచ్చి వారం రోజులుండి, వారం రోజులు విడిచిపెట్టి మరల పున: ప్రారంభమయ్యే జబ్బులు (రిలాప్సింగ్ ఫీవర్స్) కూడా వైద్యులు గుర్తించాలి. వారాల వరుసనా ఎప్పుడూ ఉష్ణోగ్రత తగ్గకుండా ఉండే వ్యాధులు కూడా ఇవికాక కొన్ని ప్రత్యేక జ్వరాలు కొన్ని వ్యాధులలో హెచ్.ఐ.వి. మధుమేహం, వయోవృద్ధులు ( నిస్త్రాణ) కొన్ని రకాల మందులు వాడుట వలన రోగ నిరోధక శక్తి తగ్గి (స్టిరాయిడ్స్, కేన్సర్లు, అవయవాల మార్పిడి) మున్నగునవి తీవ్రమైన వాటిగా గుర్తించాలి. పై పేరా లో ఉదహరించినవి సాధారణ జ్వరాల జాబితాకు చెందవు. అనుభవం గల వైద్య నిపుణులను సంప్రదించడం అవసరం.

**<u>ప్రతి వైద్యుడు పాటించవలసిన విధులు :</u>**

1) రోగనిర్ధారణ చేయటం అతి ముఖ్యం. వ్యాధిగ్రస్తుణ్ణి వారి దగ్గర బంధులను క్షుణ్ణంగా పరీక్షించి అవసరమైన (దేహన్ని భౌతికంగా) పరీక్ష చేసి, రోగితో సాన్నిహిత్యాన్ని పెంచుకుని, జ్వరానికి కారణ రుగ్మతను తెలుసుకోవడం. రక్త, మల, మూత్ర పరీక్షలు అవసరం ఉండవచ్చు. ఎక్స్ రేలు, రేడియోధార్మిక శక్తి తో చేసే సి.టి. స్కాన్ లు, అత్యంత ఖర్చుతో కూడిన ఎమ్.ఆర్.ఐ లు ఇతర స్కానింగ్ లు అనేక రక్తపరీక్షలు క్షుణ్ణంగా పరీక్షించిన తరువాత, ఏ పరీక్ష తప్పనిసరో తెలుసుకోగలిగే పరిజ్ఞానం, అనుభవం ఉన్నప్పుడే నిర్దేశించాలి. రొటీన్ గా చేయకూడదు. ప్రస్తుతం అమలులో వున్న విధానాలు 60 శాతానికి పైగా అనవసరం అని తేలింది. ఆధునిక దేశాల్లో కూడా ఈ పరిస్థితి కొంతవరకు కొనసాగడం 30 శాతం అనవసర పరీక్షలు చేయడం నిజంగా బాధాకరం. ఆత్మరక్షణ వైద్యం, సమాజధోరణి కూడా కొంతవరకు గర్హించవలసిన కారణాలు. వైద్యవృత్తి లో ఈ లక్షణాలు వల్ల సమాజం ఎంతో నష్టపోతుందని వేరే చెప్పనక్కరలేదు. వాటి ఉపయోగం ఎంతో నిరుపయోగం కూడా అంతే. వైద్య ఖర్చులు విపరీతంగా పెరగడానికి కారణాలు అవుతున్నాయి.

2) రోగికి, ప్రజలకు పూర్తి పరిజ్ఞానం కలుగచేయటం.

3) రోగం గుర్తించటానికి దశాబ్దాల కష్టం, నైపుణ్యం, అనుభవం కావాలి. ఇవన్నీ ఉన్న సందర్భాలలో, అత్యంత

# వ్యాధులు- వాహకాలు

1) అంటువ్యాధుల వాహకాలను : దోమలు, ఈగలు, పందులతో అతి దగ్గరగా జీవించటం, ఎలుకలు, కుక్కకాటు, మేకలు, పశువులను వధించే ప్రదేశాలలో అశుభ్రత, పక్షులు మున్నగునవి

**మలేరియా : (దోమకాటు) :** పేరసైట్ పరిశీలన నుండి నిర్మూలన కొరకు పథకాలు వున్నాయి. ఎంతో వ్యయమైనది. కనీసం అరికట్టబడలేదు, 4 రకాలు. ప్రమాదకరమైనది పి.ఎఫ్

కాలా అజార్ : కొన్ని ప్రాంతాలకు పరిమితం – శాండ్ ఫ్లై

**ఫైలేరియా వ్యాధి నిర్మూలన :** దోమకాటు : (వర్మ్ – లార్వా) పూర్తిగా అరికట్టబడలేదు.

**జాపనీస్ ఎన్‌సెఫలైటిస్** : పంది – దోమ – పంది (వైరస్) : ప్రమాదకరమైన మెదడు వాపు జ్వరం

అరికట్టబడలేదు. పిల్లలకు, కొన్ని ప్రాంతాకు పరిమితం. టీకా కూడా లభిస్తుంది (1–15 సం॥లు)

**డెంగ్యూ** : ఆడ దోమ కాటు – మనిషి – పగలు – ఇంటి చుట్టూ పరిశుభ్రత, నీరు నిలువ చేసి మూతలు తెరచి వుంచుట. దోమలు గదిలోనికి ప్రవేశించకుండా. ప్రాణాపాయం కూడా వుంది.

4 రకాలు : పూర్తి వ్యాధి నిరోధక శక్తి కలదు. టీకా లేదు.

**చికెన్ గున్యా :** (వైరస్) : మనిషి – దోమకాటు – మనిషి – ప్రాణాపాయం లేదు. అసౌఖ్యం, కీళ్ళ నొప్పులు భరించరానివి.

**లెప్టోస్పైరోసిస్ :** ఎలుకలు మున్నగు వాటి మూత్రం ఆహారాపదార్థములలో కలవడం. కొన్ని ప్రాంతాలకు పరిమితం.

**రేబీస్ (వైరస్)** – కుక్క కాటువలన వచ్చే మనిషిని నూరు శాతం చంపే వ్యాధి. కుక్కలు, నక్కలు, కోతులు, గబ్బిలాల వల్ల వ్యాప్తి చెందుతుంది. వెంటనే యాంటి రేబిక్ వ్యాక్సిన్, ఇమ్యూనో గ్లోబ్యులిన్ కరచిన చోట పుండు శుభ్రపరచుట, కుక్కలకి యాంటి రేబిక్ వ్యాక్సిన్. ఏదీ అమలు కాలేదు, అమలవుతున్నది వ్యాధి కల్గిన తరువాత సరియైన జాగ్రత్తలు, వైద్యం సకాలంలో వైద్యమందించడం లేదని అల్లరి సృష్టించుట. సమాజ జాడ్యానికి నిదర్శనాలు.

**టైఫాయిడ్ కలరా, గ్యాస్ట్రోఎంట్రైటిస్ :**

ఆహార పదార్థాలలో, త్రాగే నీళ్ళలో ఇంకొక వ్యాధి గ్రస్తుడు కాని, గతంలోనైనా వ్యాధి బారిన పడినవాడు గాని మలం కలసినందువల్ల సంభవిస్తాయి. మన పారిశుధ్య వ్యవస్థ ఎంత హీనంగా వున్నదో తెలుసుకోండి.

**పచ్చకామెర్లు :** సాధారణంగా వ్యాపించే కామెర్లు 90 శాతం పైగా ఇతరుల విరేచనము, మనం తినే ఆహార పదార్థాలలో కలసినందువల్ల త్రాగే నీళ్ళలో కలసినందువల్ల వస్తుంది. ఎలా కలిసిందనేది వ్రాసే కంటే ఊహించుకుంటేనే అర్థమౌతుంది.

**బర్డ్ ఫ్లూ :** కోళ్ళు, టర్కీ కోళ్ళు, కౌజు పిట్టలు, సీమ కోడి పుంజులు వాటి ఉమ్ములో మరియు ఈగలవల్ల వ్యాప్తి చెందుతుంది.

**స్వైన్ ఫ్లూ :** గాలి, శ్వాస వల్ల, పందులతో అతి సన్నిహితంగా నివశించుటవల్ల వస్తుంది. వ్యాధి నిరోధక శక్తి గాని సరైన టీకాలు లేవు.

ఆధునిక పరికరాలున్నప్పటికీ ప్రపంచంలో 30 శాతం రోగాలు కనుగొనబడుట లేదు. 20 శాతం శవ పరీక్షల తరువాత గుర్తించబడతాయి. 10 శాతం ఇప్పటికీ గుర్తించబడటం లేదు.

అట్టి క్లిష్ట పరిస్థితిలో సరియైన వైద్యం అందించాలంటే సమాజం లో పరిజ్ఞానం, వైద్యుడికి లోతైన పరిజ్ఞానం, విశేష అనుభవం ఉంటే గాని సాధ్యపడదు. జబ్బు గుర్తించలేకపోవడం నాకు తెలియదని నిజం చెప్పలేకపోవడం అనే పరిస్థితులలో కూడ ఎంతో నైపుణ్యంతో రోగిని సమాధాన పర్చడం అనుభవం గడించినప్పుడే ఆధునిక వైద్యాన్ని సమాజానికి అందించి సంతృప్తి చెందగలం.

4) అవసరమైనప్పుడు తోటి వైద్యుని సంప్రదించడం, పూర్తి దస్త్రాలు తయారుచేసి పంపడం, భద్రపరచడం, అత్యంత ఆవశ్యకం.

5) చాలా జ్వరాలు (వైరస్ వల్ల) 25 శాతం పైగా తీవ్రంగా ప్రారంభించినప్పటికీ సెల్ఫ్ లిమిటెడ్

3–4 రోజులలో తగ్గిపోతాయి పత్యం అక్కరలేదు. ద్రవ పదార్థాలు తీసుకోవచ్చును.

**ముగింపు :**

1) శరీర ఉష్ణోగ్రత పెరగడం (జ్వరం) వ్యాధి లక్షణమే తప్ప వ్యాధి కాదు.

2) సాధారణంగా వచ్చే జ్వరాలు, రోగులు, వైద్యులు, సమాజం తీసుకోవలసిన చర్యలు మాత్రమే చర్చించబడ్డాయి. ఎక్కువ జ్వరాలు సూక్ష్మ క్రిముల వల్ల వైరస్ వల్ల వస్తాయి. వైరస్ వల్ల వచ్చే జ్వరాలకు సరైన మందులు లేవు. ఎక్కువ వైరస్ వల్ల వచ్చే జ్వరాలు (20% నుండి 40%) వ్యాధులు వాటంతట అవే తగ్గుతాయి.

3) జ్వర తీవ్రతకు (104 - 105 డిగ్రీలు) వ్యాధి తీవ్రతకు సంబంధం లేదు. అత్యధికంగా వచ్చే జ్వరాలు ఏ మందులు లేకుండా తగ్గే విధానాన్ని గుర్తించాలి. ఎండ తీవ్రత వల్లే (హీట్ స్ట్రోక్) (106 - 107 డిగ్రీలు), చెమట లేకపోవుట, అపస్మారక స్థితి వున్నపుడు శరీరాన్ని వివస్త్ర గావించి, చల్లటి :

6 :

నీళ్ళతో తడిపి మర్ధన చేస్తూ, గాలి పంకా ఉపయోగించి నీడకు జేర్చి ప్రయత్నిస్తే 102 డిగ్రీలకు తగ్గిపోతుంది. ఇదే ప్రక్రియ మలేరియా, టెటనస్, మెదడు వాపు జ్వరాలు, న్యుమోనియా వ్యాధులకు కూడా వర్తింపచేయవచ్చు.

4) కొన్ని మినహాయింపులతో తీవ్రంగా ప్రారంభయ్యే జ్వరాలు నాలుగైదు రోజులలో నయమౌతాయి. ఎటువంటి వైద్యం అవసరం లేదు. అసౌఖ్యం ఎక్కువగా వుంటే ఉపశమనానికి జాగ్రత్తలు పాటిస్తే చాలు. తాత్కాలికంగా ఉష్ణోగ్రతలు తగ్గటానికి పారసిట్‌మాల్ వంటి మాత్రలు వాడితే చాలు.

5) 99 - 100 డిగ్రీలతో క్రమ క్రమంగా పెరుగుతున్న జ్వరాలు, సుదీర్ఘ వ్యాధులు, కేన్సర్ వంటి వ్యాధులకు లక్షణాలు కావచ్చు. కొన్ని రోజులు ఏ మందులు వాడకుండా వాటి లక్షణాలను, స్వరూపాలను, మార్చకుండా ఉంటే రోగాన్ని గుర్తించడం సులభతరమౌతుంది.

6) వైద్య శాస్త్రంలోని లోటు పాట్లు గుర్తించి సమగ్ర పరిజ్ఞానం అందించవలసిన భాధ్యత ప్రతీ వైద్యుడి మీద, సమాజం మీద వున్నది.

7) జ్వరాల తీవ్రత, శరీర దారుఢ్యం, వ్యాధి నిరోధక శక్తి మీద ఆధారపడి వుంటుంది. కొన్ని మినహాయింపులతో రోగికి మంచి దారుఢ్యం వుంటే ఎక్కువ జ్వరం వస్తుంది. తక్కువ రోగ నిరోధక శక్తి, వయో వృద్ధులు, నిస్త్రాణ కు లోనయ్యే వారు, మధుమేహ వ్యాధిగ్రస్తులు, అవయవ మార్పిడి వల్ల మందులు వాడేవారు, హెచ్.ఐ.వి. వ్యాధి గ్రస్థులకు ఎక్కువ గా జ్వరం రాకపోవచ్చు. ■


## లోక్‌సత్తా టైమ్స్ సురాజ్యం ప్రత్యేక సంచిక

**లోక్‌సత్తా టైమ్స్ రిపబ్లిక్ డే సందర్భంగా సురాజ్య ఉద్యమ ప్రత్యేక సంచికను ప్రచురిస్తున్నాం. సురాజ్య ఉద్యమంపై ప్రత్యేక వ్యాసాలు, ఉద్యమ వార్తలు, ఫొటోలతో రూపొందిస్తున్నాం.**

**జనవరి 28వ తేదీలోగా ఈ ప్రత్యేక సంచికకు ప్రకటనలు ఇచ్చి మీ సహాయ సహకారాలు అందించవలసినదిగా కోరుతున్నాం.**

### ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | - | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

*"లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836 ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.*

accountsdept@loksatta.org loksattatimeslsp@gmail.com



హైదరాబాద్‌లో వివేకానంద జయంతి సందర్భంగా





వనపర్తిలో సురాజ్యఉద్యమ సమావేశం



ఒంగోలులో సమాచార హక్కు ఐక్యవేదిక కార్యాలయం ప్రారంభం



కర్నూలులో జనంతో జేపీ



అత్యాచారాల నివారణకు జస్టిస్ వర్మకమిటీకి లోక్‌సత్తా ప్రతిపాదనలు



ఒంగోలులో గాంధీ విగ్రహావిష్కరణ చేస్తున్న జేపీ



ఒంగోలులో టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహావిష్కరణ చేస్తున్న జేపీ

RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2013-15



రైజ్ ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులతో డా॥ జయప్రకాష్ నారాయణ్ ముఖాముఖి

ఒంగోలు

To,

Book-Post

PRINTED MATTER

If not delivered please return to:

Lok Satta Times
8-2-674B/2/9, Plot No. 93
Happy valley, Road No. 13A
Banjara Hills, Hyderabad - 500 034

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad